


RNI: APTEL/25/42169



KANCHARLA

# మనసులో మాట

సంచలన తెలుగు దిన పత్రిక




ప్రచురణ: విశాఖపట్నం - పబ్లిషర్ కంచర్ల ఉపేంద్ర సంపుటి:1 సంచిక: 224 - సోమవారం 13 ఏప్రిల్ 2026 - ఎడిటర్: కంచర్ల అచ్యుతరావు - పేజీలు: 8+16+16+8+8 - వెల :రూ.9/-

శ్రీకాకుళం : విజయనగరం : విశాఖపట్నం: తూర్పుగోదావరి : పశ్చిమగోదావరి : కృష్ణా: గుంటూరు : ప్రకాశం : నెల్లూరు : కర్నూలు: కడప: హైదరాబాద్



# నిప్పుల కొలిమి

## 40 డిగ్రీలకు చేరిన ఉష్ణోగ్రతలు

### ఉదయం 11 గంటలకే మండుతున్న భానుడు..

### మధ్యాహ్నం బయటకు రావొద్దని అధికారుల హెచ్చరిక



**అమరావతి, ఏప్రిల్ 12 (మనసులో మాట):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా ఎండలు నిప్పులు కురిపిస్తున్నాయి. ఏప్రిల్ ఆరంభంలోనే ఉష్ణోగ్రతలు అనూహ్యంగా పెరగడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. పలు జిల్లాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 35 నుండి 40 డిగ్రీల వరకు నమోదవుతుండటంతో రాష్ట్రం సెగలు కక్కుతోంది. ఉదయం 11 గంటలకే ఎండ తీవ్రత ముదురుతుండటంతో జనం బయటకు రావాలంటేనే వణికిపోతున్నారు. మధ్యాహ్నం వేళ ప్రధాన రహదారులన్నీ నిర్మానుష్యంగా మారుతుండగా, చాలా ప్రాంతాల్లో వడగాల్పుల హెచ్చరికలు జారీ అయ్యాయి.

**మధ్యాహ్నం 12 నుండి 3 వరకు డేంజర్ జోన్:**

ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తు నిర్వహణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం 3 గంటల వరకు ఎండ తీవ్రత అత్యధికంగా ఉంటుందని, ఆ సమయంలో అత్యవసరమైతే తప్ప బయటకు రాకపోవడమే మంచిదని సూచిస్తున్నారు. వేడి గాలుల ప్రభావం ఎక్కువగా ఉన్నందున వృద్ధులు, చిన్నారులు మరియు గర్భిణీ స్త్రీలు మరింత జాగ్రత్తగా ఉండాలని నిపుణులు వివరిస్తున్నారు.



# జనగణనకు సహకరించండి

తప్పుడు సమాచారమిస్తే చర్యలు తప్పవు!

మార్చి 12న కేంద్రం సర్క్యులర్..

1948 చట్టం ప్రకారం విధులను గుర్తుచేసిన కూటమి ప్రభుత్వం



03

దేశవ్యాప్తంగా 2027 జనగణన ప్రక్రియను నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం సన్నాహాలు ముమ్మరం చేయడంతో, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అప్రమత్తమైంది. రాష్ట్రంలో జనగణన సజావుగా సాగేందుకు ప్రజలంతా సహకరించాలని కూటమి ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. 1948 జనగణన చట్టం ప్రకారం ప్రజల విధులు, బాధ్యతలను వివరిస్తూ ప్రభుత్వం తాజా ఉత్తర్వులు జారీ చేసింది.

.. వివరాలు 2లో



# ఎమ్మెల్యే యార్లగడ్డకు కోర్టు ఊరట

అమెరికా పర్యటనకు గ్రీన్ సిగ్నల్

రెండేళ్ల నిరీక్షణకు తెర..

జూలై 15 లోపు తిరిగి రావాలని ఆదేశం 3

గన్నవరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావుకు న్యాయస్థానంలో ఊరట లభించింది. గత ప్రభుత్వ హయాంలో నమోదైన కేసుల కారణంగా రెండేళ్లుగా నిలిచిపోయిన ఆయన అమెరికా పర్యటనకు ఎట్టకేలకు అనుమతి లభించింది.

# మూగబోయిన 'ఆశా' స్వరం



భారత సంగీత ప్రపంచంలో ఒక శకం ముగిసింది

తీవ్ర అస్వస్థతతో ముంబై ఆస్పత్రిలో కన్నుమూసిన దిగ్గజ గాయని..

నేడు అంత్యక్రియలు

# సీఎం, డిప్యూటీ సీఎం నివాళి

భారతీయ సంగీతం ఒక గొప్ప ప్రజ్ఞాశాలిని కోల్పోయింది..

ఎక్స్ వేదికగా నేతల సంతాపం



2

# ఇరాన్ చర్చలు విఫలం



4

ఇస్లామాబాద్‌లో 21 గంటల మేర సాగిన మారాథాన్ చర్చలు

పరస్పరం ఆరోపణలు చేసుకున్న ఇరాన్ స్పీకర్ కలీబాఫ్, అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్

# 'తుక్డే తుక్డే' గ్యాంగ్‌ను పార్లమెంటుకు పంపుతున్నారు



4

## ఎన్నికల వేళ మహిళా బిల్లుపై ఎందుకీ తొందర?

ప్రధాని మోదీకి ఖర్గే ఘాటు లేఖ

- బెంగాల్‌లో టీఎంసీ అరాచక పాలనకు ముకుతాడు వేస్తాం
- మే 4 తర్వాత మాదే ప్రభుత్వం..
- నరేంద్ర మోదీ

4





# జూన్ 26 నుంచి గోదావరి పుష్కరాలు

రాజమండ్రిలో రూ.9.55 కోట్ల పనులకు శంకుస్థాపన..

43 ఆలయాల అభివృద్ధికి రూ.51 కోట్లు మంజూరు

మంత్రి ఆనం రామనారాయణరెడ్డి 3

వచ్చే ఏడాది జూన్ 26వ తేదీ నుంచి అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న 'గోదావరి పుష్కరాల' కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కసరత్తు ముమ్మరం చేసింది. ఆదివారం రాజమండ్రిలో పర్యటించిన రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, పుష్కరాల ఏర్పాట్లకు సంబంధించి రూ.9.55 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.



# పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు

**ఎంపీలకు బీజేపీ 'త్రీ లైన్' విప్!**

**16 నుంచి 18 వరకు సభలోనే ఉండాలని ఆదేశం..**

**మహిళా రిజర్వేషన్ బిల్లుపై కీలక సవరణలు?**

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 12 :** పార్లమెంటు ప్రత్యేక సమావేశాల నేపథ్యంలో అధికార భారతీయ జనతా పార్టీ తన ఎంపీలకు మూడు లైన్ల విప్ జారీ చేసింది. ఈ నెల 16, 17, 18 తేదీల్లో జరిగే సమావేశాలకు ఎంపీలందరూ తప్పనిసరిగా హాజరుకావాలని, కేంద్ర మంత్రులతో సహా ఎవరికీ ఎటువంటి సెలవులు మంజూరు చేయబోమని పార్టీ స్పష్టం చేసింది. ఈ మూడు రోజులు అత్యంత కీలకమైన బిల్లులు సభ ముందుకు రానున్న నేపథ్యంలో పార్టీ ఈ నిర్ణయం తీసుకుంది. ఈ ప్రత్యేక సమావేశాల్లో 'నారీ శక్తి వందన్ అధినియమ్-2023' అమలుకు సంబంధించి ప్రభుత్వం కీలక సవరణలు చేసే అవకాశం కనిపిస్తోంది. వాస్తవానికి నియోజకవర్గాల పునర్విభజన, కొత్త జనగణన తర్వాతే మహిళా రిజర్వేషన్లు అమలు కావాలని చట్టం చెబుతోంది. అయితే, జనగణనలో జాప్యం జరుగుతున్న దృష్ట్యా, 2011 జనాభా లెక్కల ఆధారంగానే రిజర్వేషన్లను అమలు చేసే దిశగా కేంద్రం అడుగులు వేస్తున్నట్లు సమాచారం. 2029 లోక్‌సభ ఎన్నికల నుంచే మహిళా రిజర్వేషన్లు అమలు కావాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఈ సవరణను తీసుకువస్తోంది. ఈ చారిత్రక నిర్ణయానికి రాజకీయ పార్టీలన్నీ అతీతంగా మద్దతు తెలపాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కోరారు. ఈ మేరకు అన్ని పార్టీల ఫ్లోర్ లీడర్లకు ఆయన లేఖ రాశారు. 16వ తేదీ నుంచి ఈ బిల్లుపై పార్లమెంటులో చారిత్రక చర్చ జరుగుతుందని, మన ప్రజాస్వామ్యాన్ని ఇది మరింత పటిష్టం చేస్తుందని ప్రధాని ధీమా వ్యక్తం చేశారు. విపక్షాలు అఖిలపక్ష సమావేశం కావాలని డిమాండ్ చేస్తున్న తరుణంలో, బీజేపీ విప్ జారీ చేయడం రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపుతోంది. ప్రభుత్వం ఈ మూడు రోజుల్లో మహిళా రిజర్వేషన్లతో పాటు మరిన్ని కీలక నిర్ణయాలను ప్రకటించే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది.

# ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుకు కోర్టు ఊరట

**అమెరికా పర్యటనకు గ్రీన్ సిగ్నల్**

**రెండేళ్ల నిరీక్షణకు తెర.. జూలై 15 లోపు తిరిగి రావాలని మచిలీపట్నం కోర్టు ఆదేశం**



**మచిలీపట్నం/గన్నవరం, ఏప్రిల్ 12 (మనసులో మాట):** గత ప్రభుత్వ హయాంలో నమోదైన కేసుల ప్రభావం ఇంకా టీడీపీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలను వెంటాడుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అమెరికా పర్యటనకు వెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అమెరికాలోని తన వ్యాపార కార్యకలాపాలను ప్రత్యక్షంగా పర్యవేక్షించేందుకు రెండు సంవత్సరాలుగా ఆయన చేస్తున్న ప్రయత్నాలకు కేసులు అడ్డంకిగా మారాయి. కోర్టులు అనుమతులు ఇవ్వకపోవడంతో ఆయన పర్యటన వాయిదా పడుతూ వచ్చింది.

**అమెరికా పర్యటనకు అనుమతి**

తాజాగా మచిలీపట్నం ఎస్సీ, ఎస్టీ జిల్లా కోర్టు పలు కఠిన షరతులతో యార్లగడ్డకు అమెరికా పర్యటనకు అనుమతి మంజూరు చేసింది. నాలుగురు జామీనుదారులు ఇవ్వడంతో పాటు, అమెరికా పర్యటన పూర్తి వివరాలను ముందుగానే కోర్టుకు లిఖితపూర్వకంగా తెలియజేయాలని ఆదేశించింది. అలాగే విదేశీ పర్యటన సమయంలో ఎప్పటికప్పుడు మొబైల్ ఫోన్ ఆన్‌లో ఉంచాలని, జూలై 15, 2026లోపు తప్పనిసరిగా భారత్‌కు తిరిగి రావాలని కోర్టు స్పష్టం చేసింది. అనుమతులను పొడిగించరాదని, విధించిన షరతులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉల్లంఘించకూడదని హెచ్చరించింది. భారత్‌కు తిరిగి వచ్చిన తర్వాత వారం రోజుల్లోపు కోర్టులో హాజరు కావాలని కూడా ఆదేశాలు జారీ చేసింది. ఇకపోతే, విజయవాడ కోర్టు స్వల్ప షరతులతో అనుమతి ఇవ్వగా, బందరు కోర్టు మరింత కఠిన షరతులు విధించడం గమనార్హం. కోర్టుల నుంచి అనుమతులు లభించడంతో ఈ నెల చివరి వారంలో అమెరికా పర్యటనకు వెళ్లేందుకు యార్లగడ్డ వెంకట్రావు సన్నాహాలు ప్రారంభించారు.

# రైల్వే విస్తరణకు భారీ ఊపు

**₹1.53 లక్షల కోట్ల పెట్టుబడితో 6000 కి.మీ కొత్త లైన్లకు ఆమోదం**

**న్యూఢిల్లీ:** భారతీయ రైల్వేలు దేశవ్యాప్తంగా రైల్వే మౌలిక సదుపాయాల విస్తరణకు భారీ ప్రణాళికలు రూపొందించింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో 6000 కిలోమీటర్ల రైల్వే లైన్ల అభివృద్ధికి ఆమోదం లభించగా, ఇది గత ఏడాదితో పోలిస్తే 114 శాతం పెరుగుదలగా నిలిచింది. మొత్తం ₹1.53 లక్షల కోట్ల పెట్టుబడితో 100 ప్రాజెక్టులు మంజూరు చేయగా, ఇది గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 110 శాతం అధికం. గిరిజన ప్రాంతాల్లో కొత్త లైన్లు, రద్దీగా ఉన్న మార్గాల్లో డీకంజెషన్ పనులకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ముఖ్యంగా మహారాష్ట్ర, బీహార్ జార్ఖండ్, మధ్య ప్రదేశ్ రాష్ట్రాల్లో సరకు రవాణా, పారిశ్రామిక కనెక్టివిటీ, ప్రయాణికుల సేవలను బలోపేతం చేయనున్నారు. ₹1000 కోట్లకు పైబడిన 35కి పైగా ప్రాజెక్టులు అమల్లోకి రానున్నాయి. వీటిలో కసారా-మన్‌మడ్, ఖార్సియా-నయా రాయ్‌పూర్-పర్మల్కాసా, ఇటార్సీ-నాగ్‌పూర్, సికింద్రాబాద్-వాడి మార్గాల అప్‌గ్రేడ్ ముఖ్యంగా ఉన్నాయి. ఈ ప్రాజెక్టులు పీఎం గతి శక్తి నేషనల్ మాస్టర్ ప్లాన్ కింద అమలవుతూ, ప్రయాణ సమయం తగ్గింపు, ఉద్యోగావకాశాల సృష్టి, లోజిస్టిక్స్ ఖర్చుల తగ్గింపుకు దోహదపడతాయని అధికారులు తెలిపారు.

# జనగణనకు సహకరించండి..

**తప్పుడు సమాచారమిస్తే చర్యలు తప్పవు!**

**మార్చి 12న కేంద్రం సర్క్యులర్..**

**1948 చట్టం ప్రకారం విధులను గుర్తుచేసిన కూటమి ప్రభుత్వం**



**అమరావతి, ఏప్రిల్ 12 (మనసులో మాట):** దేశవ్యాప్తంగా 2027 జనగణన ప్రక్రియ ప్రారంభానికి కేంద్ర ప్రభుత్వం సన్నాహాలు చేపట్టింది. ఈ నేపథ్యంలో జనగణన నిర్వహణకు సంబంధించిన ముఖ్యమైన మార్గదర్శకాలను విడుదల చేసింది. దేశంలో జనగణనను దశలవారీగా నిర్వహించనున్నట్లు వెల్లడించింది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు హౌస్‌లిస్టింగ్&హౌసింగ్ సెన్సస్ నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. దీనికి ముందు ప్రజలకు 15 రోజులపాటు సెల్ఫ్ ఎన్యూమరేషన్ సదుపాయం కల్పించనున్నారని సమాచారం. అలాగే మార్చి 1 నుంచి 5 వరకు రివిజనల్ రౌండ్ నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ క్రమంలోనే రాష్ట్రంలో జరగబోయే 2027 జనగణన ప్రక్రియకు ప్రజలు పూర్తి స్థాయిలో సహకరించాలని కూటమి ప్రభుత్వం కోరింది. 1948 జనగణన చట్టం ప్రకారం ప్రజల విధులు, బాధ్యతలను స్పష్టంగా తెలియజేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మార్చి 12న కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన సర్క్యులర్ మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. జనగణన నిర్వహణ కోసం వచ్చే సిబ్బందికి ప్రజలు తప్పనిసరిగా సహకరించాలని ప్రభుత్వం సూచించింది. నిబంధనల ప్రకారం జనగణన సిబ్బందికి ప్రశ్నలు అడిగే అధికారం ఉందని, వారు కోరిన సమాచారాన్ని సరైన విధంగా అందించాలని తెలిపింది. అలాగే, సెన్సస్ అధికారులు అడిగే ప్రశ్నలకు సరైన సమాచారాన్ని ఇవ్వడం ప్రతి ఒక్కరి బాధ్యతగా పేర్కొంది. తప్పుడు సమాచారం ఇస్తే చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందని హెచ్చరించింది. ఇంటి యజమానులు సెన్సస్ అధికారులకు పూర్తి సహకారం అందించాలని, ఇళ్లకు వేసే గుర్తులు లేదా నంబర్లు తొలగించడం నేరమని స్పష్టం చేసింది. అలాగే సెన్సస్ ఫారమ్‌లను సరిగ్గా నింపడం కూడా ప్రజల బాధ్యతగా పేర్కొంది. సెన్సస్ చట్టం 1948 ప్రకారం నిబంధనలు పాటించని వారికి జరిమానాలు విధించనున్నట్లు వెల్లడించింది. జనగణన అధికారులకు సహకరించని వారికి రూ.1000 వరకు జరిమానా విధించే అవకాశం ఉందని తెలిపింది. కొన్ని సందర్భాల్లో జైలు శిక్ష కూడా ఉండొచ్చని హెచ్చరించింది. అయితే, జనగణన కోసం సేకరించిన వ్యక్తిగత వివరాలను ఇతరులు పరిశీలించే అధికారం ఎవరికీ లేదని స్పష్టం చేసింది. జనగణన ప్రక్రియ విజయవంతంగా పూర్తి కావాలంటే ప్రజల సహకారం అత్యంత కీలకమని ప్రభుత్వం పేర్కొంది.

# ఆశా భోంస్లే మృతికి సీఎం, డిప్యూటీ సీఎం నివాళి

**భారతీయ సంగీతం ఒక గొప్ప ప్రజ్ఞాశాలిని కోల్పోయింది..**

**ఎక్స్ వేదికగా నేతల సంతాపం**

**అమరావతి, ఏప్రిల్ 12 (మనసులో మాట):** ప్రముఖ గాయని ఆశా భోంస్లే (92) మరణం పట్ల ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆదివారం మధ్యాహ్నం ఆమె కన్నుమూసిన వార్త తెలిసిన వెంటనే సోషల్ మీడియా వేదికగా స్పందించిన నేతలు, సంగీత ప్రపంచానికి ఆమె చేసిన సేవలను కొనియాడారు.

**తరతరాలకు ఆమె పాటలు స్ఫూర్తి: సీఎం**

ఆశా భోంస్లే ఒక బహుముఖ ప్రజ్ఞాశాలి అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కొనియాడారు. "ఏడు దశాబ్దాలకు పైగా సంగీత పరిశ్రమకు ఆమె చేసిన సేవలు అసాధారణమైనవి. ఆమె పాడిన వేలాది పాటలు తరతరాల శ్రోతలను సుసంపన్నం చేశాయి. పద్మవిభూషణ్ గ్రహీతగా ఆమె వారసత్వం భారతీయ సంగీత చరిత్రలో



ఒక అంతర్భాగంగా నిలిచిపోతుంది" అని పేర్కొన్నారు. ఆమె కుటుంబ సభ్యులకు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది అభిమానులకు సీఎం తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మంత్రి నారా లోకేశ్ కూడా ఆశా భోంస్లే మృతికి నివాళులర్పించారు. ఆమె మరణం భారతీయ సినిమా రంగానికి తీరని లోటు అని ఆవేదన వ్యక్తం చేశారు.

**పాశ్చాత్య శైలితో యువతను ఉర్రూతలూగించారు: పవన్ కల్యాణ్**

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందిస్తూ.. ఆశా భోంస్లే మరణం సంగీత రంగానికి తీరని లోటని అన్నారు. "ఆశాజీ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నాను. హిందీతో పాటు తెలుగు, మరాఠీ, బెంగాలీ భాషల్లో ఆమె మధుర గీతాలు ఆలపించారు. ముఖ్యంగా పాశ్చాత్య సంగీత శైలిలో ఆమె పాడిన పాటలు ఒక తరం యువతను ఉర్రూతలూగించాయి" అని కీర్తించారు. ఆమె పాడిన 'దమ్ మారో దమ్', 'చురా లియా హై తుమ్నే' వంటి గీతాలను పవన్ ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. తెలుగులో ఆమె పాడిన పాటలు తక్కువే అయినా, హిందీ పాటల ద్వారా తెలుగు రాష్ట్రాల్లో ఆమె సుపరిచితులని పేర్కొన్నారు.

**ఆశా భోంస్లే పాట రూపంలో జీవించే ఉంటారు: నారా లోకేశ్**

భారతీయ భాషల్లో 80 ఏళ్ల పాటు తన సుమధుర స్వరంతో వీనుల విందైన పాటలు అందించిన లెజెండరీ సింగర్ ఆశా భోంస్లే అని ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ కొనియాడారు. ఆశాజీ భౌతికంగా మనకు దూరమైనా ఆమె పాట రూపంలో జీవించే ఉంటారని కీర్తించారు. మహా గాయని మృతి పట్ల తన ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నానని నారా లోకేశ్ పేర్కొన్నారు.

# వైద్య రంగంలో సమూల మార్పులు

**మంత్రి సత్యకుమార్ యాదవ్**

**విశాఖ రెడ్ క్రాస్ సొసైటీలో డయాగ్నోసిస్ సేవలు ప్రారంభం..**

**ఉత్తరాంధ్ర వాసులకు వరం**




విశాఖపట్నం, ఏప్రిల్ 12 (మనసులో మాట): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వైద్యారోగ్య శాఖను మరింత పటిష్ఠం చేస్తూ, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం సమూల మార్పులు తీసుకువస్తోందని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఆదివారం విశాఖపట్నంలోని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీలో గెయిల్ ఆర్థిక సహాయంతో ఏర్పాటు చేసిన నూతన డయాగ్నోసిస్ సేవలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వంతో పాటు రెడ్ క్రాస్ వంటి సంస్థలు ప్రజల ఆరోగ్యం కోసం కృషి చేయడం శుభపరిణామమని పేర్కొన్నారు. విశాఖలో అందుబాటులోకి వచ్చిన ఈ అత్యాధునిక డయాగ్నోసిస్ సేవలు ఉత్తరాంధ్ర జిల్లాల ప్రజలకు ఎంతో ఉపయోగపడతాయని వివరించారు. రాష్ట్రంలో రెడ్ క్రాస్ సొసైటీ సామాజిక బాధ్యతతో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని ఆయన కొనియాడారు. రాష్ట్రంలో ఆరోగ్య పరిస్థితులపై మంత్రి స్పందిస్తూ.. ఏపీలో ప్రస్తుతం సుమారు 2,000 మందికి పైగా తలసీమియా మరియు సికిల్‌సెల్ అనీమియా వ్యాధులతో బాధపడుతున్నట్లు వెల్లడించారు. అటువంటి బాధితులకు అవసరమైన వైద్య సహాయం అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. ఆరోగ్య శాఖలో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు, సామాన్యుడికి వైద్యం చేరువ చేయడమే తమ ప్రాధాన్యత అని మంత్రి సత్యకుమార్ యాదవ్ పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ ప్రతినిధులు, గెయిల్ సంస్థ అధికారులు మరియు స్థానిక ప్రజాప్రతినిధులు

# కలెక్టర్ మానవత్వం

**రోడ్డు ప్రమాద బాధితుడిని తన కారులోనే ఆసుపత్రికి చేర్చిన వైనం**

**మన్యం జిల్లా వాసుల హృదయాలను గెలుచుకున్న కలెక్టర్**

**పార్వతీపురం/సీతానగరం, ఏప్రిల్ 12 (మనసులో మాట):** జిల్లా కలెక్టర్ అంటే కేవలం ఫైళ్లు చూసే అధికారి మాత్రమే కాదు, ఆపదలో ఉన్నవారిని ఆదుకునే ఆపన్నహస్తం అని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్. ప్రభాకర రెడ్డి నిరూపించారు. ప్రోటోకాల్‌ను పక్కనపెట్టి, తన అధికారిక కారులోనే ఒక ప్రమాద బాధితుడిని ఆసుపత్రికి తరలించి ఆయనలోని అసలుసిసలు మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ ఘటన జిల్లా వ్యాప్తంగా పెను సంచలనం సృష్టించడమే కాకుండా, ప్రజల నీరాజనాలు అందుకుంటోంది.

**కాన్వాయ్ ఆపి.. కదిలిన కరుణ:**

ఆదివారం తన అధికారిక పర్యటనలు ముగించుకుని తిరిగి వస్తుండగా, సీతానగరం మండలం చినభోగిలి సమీపంలో ఒక బైక్ ప్రమాదాన్ని కలెక్టర్ గమనించారు. రోడ్డు పక్కన రక్తపు మడుగులో అపస్మారక స్థితిలో పడి ఉన్న వ్యక్తిని చూసి ఆయన వెంటనే తన కాన్వాయ్‌ను ఆపాల్సిందిగా ఆదేశించారు. ప్రమాదానికి గురైన వ్యక్తిని బొబ్బిలి మండలం కృష్ణరాయపురం గ్రామానికి చెందిన అజర్ శ్రీనివాసరావుగా గుర్తించారు. సాధారణంగా ఇలాంటి సమయాల్లో అధికారులు సిబ్బందికి ఆదేశాలిచ్చి వెళ్ళిపోవడం చూస్తుంటాం. కానీ కలెక్టర్ ప్రభాకర రెడ్డి స్వయంగా కారు దిగి బాధితుడి పరిస్థితిని పరిశీలించారు. క్షణం ఆలస్యమైనా ప్రాణాపాయం ఉంటుందని గ్రహించి, అంబులెన్స్ కోసం వేచి చూడకుండా తన అధికారిక వాహనంలోనే బాధితుడిని ఎక్కించుకున్నారు. ముందుగా బాధితుడిని సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి



తరలించి, అక్కడ వైద్యులతో మాట్లాడి ప్రాథమిక చికిత్స చేయించారు. అయితే బాధితుడి పరిస్థితి విషమంగా ఉండటంతో, తిరిగి తన కారులోనే పార్వతీపురం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. బాధితుడిని ఆసుపత్రిలో చేర్చి, మెరుగైన వైద్యం అందేలా చూసే వరకు కలెక్టర్ అక్కడే ఉండి పర్యవేక్షించడం గమనార్హం. జిల్లా ఏర్పడిన తర్వాత ఒక అత్యున్నత స్థాయి అధికారి ఇంతటి ఉదారత చూపడం ఇదే మొదటిసారి అని స్థానికులు కొనియాడుతున్నారు. "మనసున్న మహారాజు" అంటూ సోషల్ మీడియాలో ప్రభాకర రెడ్డి గారిపై ప్రశంసల జల్లు కురుస్తోంది. ఆపదలో ఉన్నప్పుడు స్పందించే గుణం పదవి కంటే గొప్పదని ఆయన మరోసారి నిరూపించారు.



# ఏలూరు జిల్లాలో పెద్దపులి కలకలం

**గోదావరి దాటి వచ్చిన వైనం!**

**పోలవరం ముంపు గ్రామాల్లో సంచారం..**

**రాత్రి వేళ బయటకు రావొద్దని అటవీశాఖ హెచ్చరిక**

**ఏలూరు/పోలవరం, ఏప్రిల్ 12 (మనసులో మాట):** ఏలూరు జిల్లాలో పెద్దపులి సంచారం కలకలం రేపుతోంది. పోలవరం ప్రాజెక్టు ముంపు గ్రామాలు కొత్తూరు, వాడపల్లి పరిసరాలలో పెద్దపులి సంచరిస్తోంది. ఆ పెద్దపులి అల్లూరి జిల్లా మాంటూరు నుంచి గోదావరి నది దాటి ఏలూరు జిల్లాలోకి తిరిగి ప్రవేశించింది. అటవీ శాఖ అధికారులు వీడియో ట్రాకర్ సాయంతో నిరంతరం పెద్దపులి కదలికలను పర్యవేక్షిస్తున్నారు. పెద్దపులి సంచారం నేపథ్యంలో అధికారులు అప్రమత్తం అయ్యారు. ప్రజలకు పలు హెచ్చరికలు జారీ చేశారు. ముందు జాగ్రత్తగా రాత్రి వేళల్లో ఒంటరిగా తిరగవద్దని హెచ్చరించారు.

**ఊపిరి పీల్చుకున్న మన్యం వాసులు..**

పెద్దపులి నది దాటటంతో రెండు వారాలుగా కంటి మీద కునుకులేకుండా అల్లాడిపోయిన మన్యం వాసులు ఊపిరి పీల్చుకున్నారు. మూడు రోజుల పాటు దేవీపట్నం, లింగవరం పరిసర ప్రాంతాల్లో పులి తిరిగింది. శనివారం ఉదయం దేవీపట్నం, అగ్రహారం పరిసర ప్రాంతాల్లో గోదావరిని దాటుకుని ఏలూరు జిల్లా పోలవరం మండలం సింగనపల్లికి చేరుకుంది. అది పోలవరం ప్రాజెక్ట్ ముంపు ప్రాంతం కావటంతో నిర్వాసితులు గ్రామాన్ని ఖాళీ చేసి పునరావాస కాలనీలకు వెళ్లిపోయారు.

# అల్లూరి జిల్లాలో విషాదం

**ఈతకు వెళ్లి ముగ్గురు బాలుర మృతి**

**మత్య గెడ్డలో మునిగి ప్రాణాలు కోల్పోయిన చిన్నారులు..**

**పర్రెడ గ్రామంలో మిన్నంటిన రోదనలు**

**పాడేరు, ఏప్రిల్ 12 (మనసులో మాట):** అల్లూరి సీతారామరాజు జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. సరదాగా ఈతకు వెళ్లిన ముగ్గురు బాలురు నీటిలో మునిగి ప్రాణాలు కోల్పోయారు. పాడేరు మండలం పెదబయలు పరిధిలోని పర్రెడ గ్రామంలో ఆదివారం ఈ ఘటన జరిగింది. మృతులంతా 10 ఏళ్లలోపు వారే కావడంతో ఆ గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పర్రెడ గ్రామానికి చెందిన కోడా ప్రదీప్ (9), పాంగి శ్రీను (10), జలంగి హర్షిత్ (10)లు ఆదివారం మధ్యాహ్నం గ్రామానికి సమీపంలోని మత్య గెడ్డలో ఈత కొట్టేందుకు వెళ్లారు. నీటిలోకి దిగిన బాలురు ప్రమాదవశాత్తు లోతైన ఊబిలో చిక్కుకుపోయారు. బయటకు రాలేక నీటిలోనే మునిగి ప్రాణాలు విడిచారు. పిల్లలు ఎంతసేపటికీ తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు గెడ్డ వద్దకు వెళ్లి చూడగా, ముగ్గురు విగతజీవులుగా కనిపించారు. అల్లారుముద్దుగా పెరుగుతున్న చిన్నారులు కళ్లముందే శవాలుగా పడి ఉండటంతో తల్లిదండ్రులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. వారి ఆక్రందనలు చూసి గ్రామస్తులంతా కన్నీటి పర్యంతమయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాలను పరిశీలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. వేసవి సెలవులు కావడంతో పిల్లలు నీటి కుంటలు, వాగుల వద్దకు వెళ్లే సమయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరుతున్నారు.

# మఫ్టీలో వచ్చి ఎత్తుకెళ్తున్నారు

**పోలీసులపై అంబటి రాంబాబు సంచలన ఆరోపణలు**

**వైసీపీ కేడర్‌ను చిత్రహింసలకు గురిచేస్తున్నారు..**

**పవన్ కల్యాణ్ స్పందించాలని డిమాండ్**



**చిత్తూరు/పుత్తూరు, ఏప్రిల్ 12 (మనసులో మాట):** రాష్ట్రంలో పోలీసులు సంఘ విద్రోహ శక్తుల్లా వ్యవహరిస్తున్నారని, మఫ్టీలో వచ్చి వైసీపీ కార్యకర్తలను ఎత్తుకెళుతున్నారని మాజీ మంత్రి అంబటి రాంబాబు సంచలన ఆరోపణలు చేశారు. ఆదివారం చిత్తూరు జిల్లా పుత్తూరులో మాజీ డిప్యూటీ సీఎం నారాయణ స్వామిని కలిసిన అనంతరం అంబటి మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం పోలీసులను అడ్డం పెట్టుకుని వైసీపీ కేడర్‌ను అణగదొక్కాలని చూస్తోందని ఆయన మండిపడ్డారు. సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టాడనే నెపంతో తిరుపతి మండలానికి చెందిన సర్పంజరి తంబిరెడ్డిని పోలీసులు కిడ్నాప్ చేశారని అంబటి ఆరోపించారు. "తంబిరెడ్డిని మూడు రోజుల పాటు అజ్ఞాతంలో ఉంచి చిత్రహింసలకు గురిచేశారు. ఆ తర్వాతే కేసు నమోదు చేశారు. వైసీపీ నేతలను భయభ్రాంతులకు గురిచేయడమే లక్ష్యంగా ఇదంతా జరుగుతోంది. పోలీసులతో అణచివేయాలని చూస్తే మేము వెనక్కి తగ్గే ప్రసక్తే లేదు" అని అంబటి హెచ్చరించారు.

**పవన్ కల్యాణ్ సమాధానం చెప్పాలి**

కూటమి ప్రభుత్వం కాపులను, బలిజలను దారుణంగా మోసం చేస్తోందని అంబటి విమర్శించారు. ఈ వ్యవహారంపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. "కాపు సామాజిక వర్గానికి జరుగుతున్న అన్యాయంపై పవన్ నోరు విప్పాలి. లేనిపక్షంలో ఆయన సొంత సామాజిక వర్గాన్నే మోసం చేసినట్లు అవుతుంది" అని వ్యాఖ్యానించారు. వైసీపీ కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని, ప్రభుత్వ వేధింపులపై న్యాయపోరాటం చేస్తామని అంబటి రాంబాబు స్పష్టం చేశారు.

# జూన్ 26 నుంచి గోదావరి పుష్కరాలు

- రాజమండ్రిలో రూ.9.55 కోట్ల పనులకు శంకుస్థాపన..
- 43 ఆలయాల అభివృద్ధికి రూ.51 కోట్లు మంజూరు
- మంత్రి ఆనం రామనారాయణరెడ్డి





**రాజమండ్రి, ఏప్రిల్ 12(మనసులో మాట):** వచ్చే ఏడాది జూన్ 26వ తేదీ నుంచి జరగనున్న గోదావరి పుష్కరాలకు పలు దేవాలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి వ్యాఖ్యానించారు. అన్ని దేవాలయాలను పున: నిర్మాణం చేస్తున్నామని పేర్కొన్నారు. గోదావరి పుష్కరాలు నిర్వహించడంపై ముఖ్యమంత్రి చంద్రబాబుకు చాలా అనుభవం ఉందని తెలిపారు. సీఎంగా చంద్రబాబు ఇప్పటికే రెండుసార్లు గోదావరి పుష్కరాలు నిర్వహించగా మూడోసారి వచ్చే ఏడాది జరగనున్న పుష్కరాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నారని ప్రస్తావించారు. ఆదివారం రాజమండ్రిలో పర్యటించి, పలు కార్యక్రమాల్లో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. గోదావరి పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి అన్ని శాఖల అధికారులకు ఆదేశించారని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై ఇప్పటికే మూడు సమీక్ష సమావేశాలు జరిగాయని తెలిపారు. ఈరోజు గోదావరి పుష్కరాలకు సంబంధించి రాజమండ్రిలో రూ.9.55 కోట్ల పనులకు శంకుస్థాపనలు చేశామని వివరించారు. రాజమండ్రితోపాటు గోదావరి పరివాహక ప్రాంతంలో ఉన్న అన్ని దేవాలయాలను గోదావరి పుష్కరాలకు అభివృద్ధి చేస్తామని అన్నారు. ఇప్పటికే 43 దేవాలయాల పున: నిర్మాణం కోసం రూ.51 కోట్ల నిధులు మంజూరు చేశామని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ 23 నెలల పాలనలో దేవాదాయ ధర్మాదాయ శాఖకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చిందని వెల్లడించారు. తూర్పుగోదావరి జిల్లాలో ధూప, దీప, నైవేద్యాలను 162 దేవాలయాల్లో అమలు చేస్తున్నామని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు.

# జగన్ రాజకీయం ఉగ్రవాదాన్ని మించిన ఉన్మాదం

**మంత్రి నిమ్మల రామానాయుడు**

**వైసీపీది 'గొడ్డలి పార్టీ' సంస్కృతి..**

**అధికారం కోసం ఎవరినైనా అంతం చేస్తారని విమర్శ**



**అమరావతి, ఏప్రిల్ 12 (మనసులో మాట):** వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అనుసరిస్తున్న రాజకీయ విధానాలపై రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. జగన్ రాజకీయాలు ఉగ్రవాదాన్ని మించిన ఉన్మాదంలా తయారయ్యాయని ఆయన మండిపడ్డారు. ఆదివారం మీడియాతో మాట్లాడిన ఆయన, వైసీపీ తీరుపై నిప్పులు చెరిగారు. వైసీపీ ఇప్పుడు ఒక రాజకీయ పార్టీలా కాకుండా 'గొడ్డలి పార్టీ'గా మారిందని మంత్రి నిమ్మల విమర్శించారు. "చంపుతాం, నరుకుతాం, అంతు చూస్తాం అని బెదిరించడమే ఆ పార్టీ నేతలకు తెలిసిన రాజకీయం. విధ్వంసం సృష్టించడం తప్ప ఆ పార్టీకి మరో ఎజెండా లేదు" అని ధ్వజమెత్తారు. వైసీపీ నాయకత్వం వల్ల రాష్ట్రానికి ముప్పు పొంచి ఉందని ఆయన హెచ్చరించారు. రాజకీయంగా తనకు ఎవరు అడ్డు వచ్చినా వారిని అడ్డుతొలగించుకోవడమే జగన్ నైజమని నిమ్మల ఆరోపించారు. "అధికారం కోసం సొంత బాబాయ్ అని కూడా చూడకుండా, ఎవరినైనా అంతం చేయడానికి జగన్ వెనుకాడరు. వినాశనం పునాదుల మీద రాజకీయం చేయడం ఆయనకు అలవాటు" అని ఘాటుగా విమర్శించారు. రాష్ట్ర ప్రజలు ఇలాంటి ఉన్మాద రాజకీయాలను సహించబోరని, వైసీపీ పతనం ఖాయమని మంత్రి స్పష్టం చేశారు.

# తెలుగుదేశం పార్టీపై కేటీఆర్ ప్రశంసలు

**రెండు రాష్ట్రాల్లో హాట్ టాపిక్‌గా కేటీఆర్ కామెంట్స్**

**టీడీపీలో ఆ మంచి లక్షణం ఉందని వ్యాఖ్యయ**



**హైదరాబాద్, ఏప్రిల్ 12 (మనసులో మాట):** రాబోయే ఎన్నికల పొత్తులపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారకరామారావు (కేటీఆర్) చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. ఆదివారం మీడియా ప్రతినిధులతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన పలు కీలక అంశాలపై తన అభిప్రాయాలను పంచుకున్నారు. ముఖ్యంగా బీజేపీతో పొత్తు విషయమై వస్తున్న వార్తలను ఆయన కచ్చితంగా తోసిపుచ్చారు. "పొత్తులు మాకు ఎప్పుడూ కలిసి రాలేదు. బీజేపీతో ఎట్టి పరిస్థితుల్లోనూ పొత్తు పెట్టుకోబోం" అని స్పష్టం చేశారు. పదేళ్ల పాలనలో తమకు, ప్రజలకు మధ్య దూరం పెరిగిందని ఆయన అంగీకరించారు. గ్యాప్‌ను పూడ్చేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని, ప్రజలకు దగ్గరవుతామని ధీమా వ్యక్తం చేశారు.

**టీడీపీపై ప్రశంసలు**

ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీని ప్రస్తావిస్తూ కేటీఆర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "టీడీపీలో కొన్ని మంచి లక్షణాలు ఉన్నాయి. ఆ పార్టీ నాయకత్వం నేరుగా కార్యకర్తలతో మమేకమవుతుంది. మా పార్టీలో ఆ అనుసంధానం లోపించింది. కార్యకర్తలకు దూరమయ్యాం కాబట్టే ఓడిపోయాం" అని విశ్లేషించారు. లోపాలను సరిదిద్దుకుని పార్టీని బలోపేతం చేస్తామని చెప్పారు. ఇటీవల రాజకీయ పరిణామాలపై స్పందిస్తూ.. "జైలుకు వెళ్తేనే ముఖ్యమంత్రులు అవుతారనేది ఒక భ్రమ మాత్రమే. హత్యలు చేసి జైలుకు వెళ్లేంత దుర్మార్గులం మేము కాదు" అని ఘాటుగా వ్యాఖ్యానించారు. రాబోయే డీలిమిటేషన్ (నియోజకవర్గాల పునర్విభజన) ద్వారా అసెంబ్లీ స్థానాలు పెరుగుతాయని, అప్పుడు ఏ నియోజకవర్గం నుంచైనా పోటీ చేయడానికి తాను సిద్ధమని కేటీఆర్ ప్రకటించారు. పార్టీ క్యాడర్‌లో ఉత్సాహం నింపేలా, అదే సమయంలో ఓటమికి గల కారణాలను నిజాయితీగా విశ్లేషిస్తూ కేటీఆర్ చేసిన ఈ వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో పెద్ద చర్చకు దారితీశాయి.

# వీడిన వరుస హత్యల మిస్టరీ

- మోస్ట్ వాంటెడ్ అంతర్ రాష్ట్ర హంతకుడి అరెస్ట్
- ఒంటరి మహిళలే లక్ష్యంగా దాడులు
- రూ. 20 లక్షల నగలు స్వాధీనం



**తిరుపతి, ఏప్రిల్ 12 (మనసులో మాట):** తిరుపతి జిల్లాలో సంచలనం సృష్టించిన వరుస హత్యల కేసును ఛేదిస్తూ, అంతర్ రాష్ట్ర మోస్ట్ వాంటెడ్ హంతకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఒంటరిగా ఉన్న మహిళలను లక్ష్యంగా చేసుకుని, వారిని హత్య చేసి నగలతో పరారవ్వడం నిందితుడికి అలవాటని తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. 2018లో కేరళంలో జరిగిన ఓ హత్య కేసులో శిక్ష పడిన తర్వాత పోలీసు కస్టడీ నుంచి తప్పించుకుని మారుపేర్లతో నిందితుడు తిరుగుతున్నాడు. కర్ణాటక, కేరళం రాష్ట్ర సరిహద్దు సులియా ప్రాంత నివాసి విశ్వనాథ్ ఏ ప్రశాంత్ ఏ అజీజ్‌గా గుర్తించామని తెలిపారు. కర్ణాటక రాష్ట్రం గుల్బర్గాకు చెందిన విశ్వనాథ్ ఆధార్ కార్డును అతని పేరు మీద మార్చుకుని నేరాలకు నిందితుడు పాల్పడుతున్నాడు. 2018లో కేరళం రాష్ట్రంలో హత్య కేసులో నిందితుడికి శిక్ష పడి పోలీసుల కస్టడీ నుంచి తప్పించుకుని తిరుగుతున్నాడు. ఇతని ఆచూకీ కోసం కేరళం పోలీసులు రూ. 2 లక్షల రివార్డు కూడా ప్రకటించారు. కర్ణాటకలోని గుల్బార్గాకు చెందిన ఒక వ్యక్తి ఆధార్ కార్డును తన పేరు మీద మార్చుకుని (ఫోర్జరీ చేసి) ఇన్ని రోజులు పోలీసుల కన్నుగప్పి తిరుగుతున్నాడు. తిరుపతి జిల్లా వ్యాప్తంగా ఈ నిందితుడు నలుగురిని హత్య చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. నాలుగు హత్యలు చేసి బంగారు నగలను దోచుకున్నాడు. తిరుచానూరులో రెండు హత్యలు, రామచంద్రపురంలో ఒకటి, పిచ్చాటూరులో మరొక హత్య చేసి నగలు దోపిడి చేశాడని పోలీసులు తెలిపారు. నిందితుడి నుంచి రూ. 20 లక్షల విలువైన బంగారు నగలు, ఒక ఆటోను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ నేరాల్లో నిందితుడికి సహకరించిన రాజమ్మ అనే మహిళను కూడా పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను మీడియాకు తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు వెల్లడించారు. నిందితుడి అరెస్ట్ సమాచారాన్ని కేరళం పోలీసులకు అందజేస్తామని తెలిపారు. అత్యంత చాకచక్యంగా వ్యవహరించి ఈ అంతర్ రాష్ట్ర హంతకుడిని పట్టుకున్న పోలీస్ బృందాన్ని ఈ సందర్భంగా అభినందించారు. నేరస్థులు తప్పుడు గుర్తింపు కార్డులతో తిరుగుతున్న నేపథ్యంలో ప్రజలు, ముఖ్యంగా ఒంటరిగా ఉండే మహిళలు అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.

మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక



# మూగబోయిన 'ఆశా' స్వరం..

## భారత సంగీత ప్రపంచంలో ఒక శకం ముగిసింది

## తీవ్ర అస్వస్థతతో ముంబై ఆస్పత్రిలో కన్నుమూసిన దిగ్గజ గాయని.. నేడు అంత్యక్రియలు

**ముంబై, ఏప్రిల్ 12:** భారతీయ చలనచిత్ర సంగీత చరిత్రలో ఒక అద్భుత అధ్యాయం ముగిసింది. ఎనిమిది దశాబ్దాల పాటు తన గాత్రంతో కోట్లాదిమందిని అలరించిన లెజెండరీ గాయని ఆశా భోంస్లే (92) ఇక లేరు. శనివారం తీవ్ర అస్వస్థతతో ముంబైలోని బ్రీచ్ కాండీ ఆసుపత్రిలో చేరిన ఆమె, చికిత్స పొందుతూ ఆదివారం మధ్యాహ్నం తుదిశ్వాస విడిచారు. ఛాతీలో ఇన్ఫెక్షన్ కారణంగా శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది కలగడంతో వైద్యులు చికిత్స అందించినప్పటికీ ఫలితం దక్కలేదు.

### రేపు శివాజీ పార్కులో అంత్యక్రియలు:


ఆమె మరణ వార్త విన్న సంగీత ప్రపంచం దిగ్భ్రాంతికి లోనైంది. సోమవారం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు ఆమె పార్థివ దేహాన్ని ముంబైలోని ఆమె నివాసంలో అభిమానుల సందర్శనార్థం ఉంచనున్నారు. అనంతరం సాయంత్రం 4 గంటలకు ముంబైలోని శివాజీ పార్కులో అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

### సంగీత సామ్రాజ్ఞి ప్రస్థానం:

బ్రిటిష్ ఇండియాలోని సాంగ్లీ స్టేట్‌లో 1933 సెప్టెంబర్ 8న జన్మించిన ఆశా భోంస్లే, దిగ్గజ గాయని లతా మంగేష్కర్‌కు సోదరి. 1943లో తండ్రి దీనానాథ్ మంగేష్కర్ మరణానంతరం కుటుంబ పోషణ కోసం కేవలం పదేళ్ల ప్రాయంలోనే గాయనిగా ప్రస్థానాన్ని మొదలుపెట్టారు. శాస్త్రీయ సంగీతం నుండి మొదలుకొని పాప్, గజల్స్, ఖవ్వాలీల వరకు అన్ని రకాల పాటలను పాడగల ప్రతిభ ఆమె సొంతం.

### రికార్డుల గాయని:

సుదీర్ఘ కెరీర్‌లో ఆమె 20కి పైగా భాషల్లో 12,000కు పైగా పాటలు ఆలపించారు. 2011లో ప్రపంచంలోనే అత్యధిక పాటలు పాడిన గాయనిగా గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో ఆమె స్థానం సంపాదించారు. భారత ప్రభుత్వం ఆమెను 'పద్మ విభూషణ్' (2008), 'దాదాసాహెబ్ ఫాల్కే' (2000) అవార్డులతో సత్కరించింది. తెలుగులోనూ ఆమె పాడిన పాటలు ఇప్పటికీ శ్రోతల చెవుల్లో మారుమోగుతూనే ఉన్నాయి. ఆమె మరణంతో యావత్ దేశం సంతాప సముద్రంలో మునిగిపోయింది.




# అమెరికా-ఇరాన్ చర్చలు విఫలం



- ఇస్లామాబాద్‌లో 21 గంటల మేర సాగిన మారాథాన్ చర్చలు
- పరస్పరం ఆరోపణలు చేసుకున్న ఇరాన్ స్పీకర్ కలీబాఫ్, అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్

**ఇస్లామాబాద్, ఏప్రిల్ 12 (మనసులో మాట):** అంతర్జాతీయంగా ఎంతో ఉత్కంఠ రేపిన అమెరికా-ఇరాన్ ఉన్నత స్థాయి చర్చలు ఎటువంటి ఒప్పందం కుదరకుండానే ముగిశాయి. పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్ వేదికగా సుమారు 21 గంటల పాటు సుదీర్ఘంగా సాగిన ఈ మారాథాన్ చర్చలు చివరకు విఫలమయ్యాయి. చర్చల వైఫల్యానికి ఒకరిపై ఒకరు బాధ్యత మోపుతూ ఇరు దేశాల ప్రతినిధులు తీవ్ర విమర్శలు చేసుకున్నారు. చర్చల అనంతరం ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మొహమ్మద్ బఖేర్ కలీబాఫ్ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా వం-సస పోస్టులు చేశారు. తమ ప్రతినిధి బృందం పూర్తి సద్భావనతో, నిర్మాణాత్మక ప్రతిపాదనలతో చర్చలకు హాజరైందని ఆయన తెలిపారు. "చర్చలకు ముందు మేము పూర్తి చిత్తశుద్ధితో ఉన్నామని స్పష్టం చేశాం. కానీ గత యుద్ధాల అనుభవాల దృష్ట్యా మాకు అమెరికాపై నమ్మకం లేదు. ఈ దఫా చర్చల్లో అవతలి పక్షం (అమెరికా) మా నమ్మకాన్ని గెలుచుకోవడంలో పూర్తిగా విఫలమైంది" అని కలీబాఫ్ ఆరోపించారు. మా వాదనలు వారికి అర్థమయ్యాయని, ఇప్పుడు మా నమ్మకాన్ని పొందాలా వద్దా అనేది వారే తేల్చుకోవాలని ఆయన సవాల్ విసిరారు. మరోవైపు, అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఆదివారం ఉదయం మీడియా సమావేశంలో మాట్లాడుతూ చర్చల వైఫల్యంపై విచారం వ్యక్తం చేశారు. "మేము 21 గంటల పాటు అనేక విషయాలపై చర్చించాం. ఇది శుభపరిణామమే అయినా ఒప్పందం కుదరకపోవడం దురదృష్టకరం. మా పరిమితులు ఏంటో, ఏ విషయాల్లో సర్దుకుపోగలమో స్పష్టంగా చెప్పాం. కానీ మా షరతులను అంగీకరించడానికి ఇరాన్ నిరాకరించింది. ఈ ఫలితం అమెరికా కంటే ఇరాన్‌కే ఎక్కువ నష్టం కలిగిస్తుంది" అని వాన్స్ హెచ్చరించారు. ఇరాన్ అణ్వాయుధ సామర్థ్యం పొందకుండా నిరోధించడమే తమ ప్రధాన లక్ష్యమని వాన్స్ పునరుద్ఘాటించారు. "అణ్వాయుధాలు తయారు చేయబోమని ఇరాన్ నుండి మాకు దీర్ఘకాలిక హామీ కావాలి. అటువంటి నిబద్ధత వారిలో ఇంకా కనిపించలేదు" అని ఆయన స్పష్టం చేశారు. వాషింగ్టన్ ఇప్పటికే తన తుది ప్రతిపాదనను ఇరాన్ ముందు ఉంచిందని తెలిపారు. తాజా వైఫల్యంతో ఇరు దేశాల మధ్య దౌత్యపరమైన ప్రతిష్టంభన మరింత ముదిరినట్లయింది. అణు కార్యక్రమం, ఆంక్షల ఉపసంహరణ వంటి కీలక అంశాలపై గతంలో జరిగిన చర్చలు కూడా మధ్యలోనే నిలిచిపోయిన విషయం తెలిసిందే.

# చైనాకు ట్రంప్ 'సీరియస్' వార్నింగ్..

- ఆయుధాల సరఫరాపై ఆగ్రహం!
- ఇరాన్‌కు సహకరిస్తే భారీ మూల్యం తప్పదు..
- ఆర్థిక ఆంక్షలు, సైనిక చర్యకూ వెనుకాడబోమని హెచ్చరిక



**వాషింగ్టన్/బీజింగ్, ఏప్రిల్ 12 :** అగ్రరాజ్యం అమెరికా మరియు చైనాల మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతలు మరోసారి తారాస్థాయికి చేరాయి. ఇరాన్‌కు రహస్యంగా ఆయుధాలు సరఫరా చేస్తున్నారనే ఆరోపణలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చైనాకు తీవ్రస్థాయిలో హెచ్చరికలు జారీ చేశారు. ఇస్లామాబాద్ వేదికగా అమెరికా-ఇరాన్ మధ్య జరిగిన శాంతి చర్చలు విఫలమైన మరుసటి రోజే ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేయడం అంతర్జాతీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. "మా శత్రువులకు మీరు ఆయుధాలు ఇస్తే, మేము మిమ్మల్ని వదిలిపెట్టబోము" అని ట్రంప్ ఘాటుగా హెచ్చరించారు. హర్మూజ్ జలసంధి గుండా అంతర్జాతీయ చమురు రవాణాను అడ్డుకోవాలన్న ఇరాన్ ప్రయత్నాలకు ఏ దేశం సహకరించినా కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అవసరమైతే తమ ప్రయోజనాల కోసం సైనిక చర్యకు కూడా వెనుకాడబోమని ఆయన గట్టి సంకేతాలిచ్చారు. ఇరాన్‌కు చైనా అందిస్తున్న సైనిక సహకారం తమ బలగాలకు నేరుగా ముప్పుగా పరిణమిస్తోందని వైట్ హౌస్ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. కేవలం సైనిక పరంగానే కాకుండా, ఆర్థికంగా కూడా చైనాను దెబ్బతీసేందుకు ట్రంప్ వ్యూహరచన చేస్తున్నారు. ఇరాన్‌తో సంబంధాలు కొనసాగించే చైనా కంపెనీలపై కఠినమైన ఆర్థిక ఆంక్షలు విధించడంతో పాటు, వాటిని అంతర్జాతీయ బ్యాంకింగ్ వ్యవస్థ నుండి బహిష్కరిస్తామని హెచ్చరించారు. దీనివల్ల చైనా వాణిజ్యం తీవ్రంగా దెబ్బతినే అవకాశం ఉంది.

### ఆరోపణలను ఖండించిన చైనా:

ట్రంప్ చేసిన ఆరోపణలను చైనా ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. అమెరికా నిరాధారమైన నిందలు వేస్తోందని మండిపడింది. పశ్చిమాసియా సంక్షోభంలో ఉన్న ఏ దేశానికీ తాము ఆయుధాలు సరఫరా చేయలేదని వాషింగ్టన్‌లోని చైనా రాయబార కార్యాలయం ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. కొన్ని మీడియా సంస్థలు కావాలనే 'సెన్సేషనలిజం' కోసం తమపై తప్పుడు కథనాలు ప్రసారం చేస్తున్నాయని విమర్శించింది. అమెరికా హెచ్చరికల నేపథ్యంలో అగ్రరాజ్యాల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితులు నెలకొన్నాయి.

# 'తుక్డే తుక్డే' గ్యాంగ్‌ను పార్లమెంటుకు పంపుతున్నారు

- బెంగాల్‌లో టీఎంసీ అరాచక పాలనకు ముకుతాడు వేస్తాం
- మే 4 తర్వాత మాదే ప్రభుత్వం
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ



**సిలిగురి:** బెంగాల్‌లో 15 ఏళ్లుగా అధికారంలో ఉన్న టీఎంసీ తీవ్ర అవినీతి, హింస, బెదిరింపు రాజకీయాలతో అవకతవకల పాలన సాగించిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. రాజకీయ హింస, ప్రతిపక్ష కార్యకర్తలను బెదిరించడం, భయోత్పాత వాతావరణం సృష్టించిందని చెప్పారు. విపక్ష కార్యకర్తలను లక్ష్యంగా చేసుకోవడం, కొన్ని సందర్భాల్లో హత్యలు చోటుచేసుకున్నాయని, ఇలాంటి చర్యలు ఎంతమాత్రం ఆమోదయోగ్యం కావని అన్నారు. ఈ పరిస్థితి ఇంకెంతోకాలం సాగదని, రాష్ట్ర రాజకీయ వాతావరణంలో మార్పు అవసరమని ప్రధాని పిలుపునిచ్చారు. 'టీఎంసీ వాళ్లు జాగ్రత్తగా వినాలి. మే 4 తర్వాత రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం వస్తుంది. గత 15 ఏళ్లుగా టీఎంసీ ప్రతీ చర్యకు, ప్రతీ పైసాకు సమాధానం చెప్పుకోవాల్సి వస్తుంది. బెదిరించడం, భయోత్పాతం సృష్టించడం, రాజకీయ హింస, పార్టీ కార్యకర్తలను చంపడం వంటివి టీఎంసీ విధానంగా మారాయి. ఇక చాలు. బెంగాల్ ప్రజలు వీటిని సహించేందుకు సిద్ధంగా లేరు. సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్ అనేది బీజేపీ మంత్రం. బెంగాల్‌లో సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్, టీఎంసీ దోపిడీదారులకు ముకుతాడు వేయడం మా మంత్రం' అని మోదీ అన్నారు. టీఎంసీ విభజన ఎజెండాలు జాతీయ ఐక్యత, ప్రాంతీయ భద్రతకు ముప్పుగా పరిణమిస్తున్నాయని ప్రధాని విమర్శించారు. సిలిగురి కారిడార్, ఈశాన్య ప్రాంతాల విషయంలో చేస్తున్న వ్యాఖ్యలను ఆయన ప్రస్తావిస్తూ, సిలిగురి కారిడార్‌ను విడదీస్తామని తుక్డే తుక్డే గ్యాంగ్ బెదిరిస్తోంది, అలాంటి వారిని పార్లమెంటుకు టీఎంసీ పంపుతోందని ఆరోపించారు. ఈశాన్య రాష్ట్రాలకు గేట్‌వేగా ఉన్న సిలిగురి కారిడార్ అభివృద్ధికి కేంద్రం కృషి చేస్తోందని చెప్పారు. బీజేపీ అధికారంలోకి వస్తే బెంగాల్‌లో జరుగుతున్న హింసాకాండ, మహిళలపై పెరుగుతున్న నేరాలను అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. మహిళల రక్షణకు అవసరమైన పోలీస్ సపోర్ట్ సిస్టమ్ తీసుకువస్తామని, మహిళలపై జరుగుతున్న నేరాలపై సత్వర న్యాయాన్ని అందిస్తామని మోదీ హామీ ఇచ్చారు. రాజకీయ హింసపై విచారణకు ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేస్తామని, నేర, మాఫియా కార్యకలాపాల్లో ప్రమేయమున్న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# ఎన్నికల వేళ మహిళా బిల్లుపై ఎందుకీ తొందర?

### ప్రధాని మోదీకి ఖర్గే ఘాటు లేఖ

### రాజకీయ లబ్ధి కోసమేనా? ఏప్రిల్ 29 తర్వాత అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 12:** నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతంలో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న తరుణంలో మహిళా రిజర్వేషన్ బిల్లును హడావిడిగా అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నించడాన్ని కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే తీవ్రంగా తప్పుబట్టారు. ఈ మేరకు ఆయన ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఒక బహిరంగ లేఖ రాశారు. ఇది కేవలం ఎన్నికల వేళ రాజకీయ ప్రయోజనం పొందేందుకు చేస్తున్న ప్రయత్నంగా కనిపిస్తోందని ఆరోపించారు. 'నారీ శక్తి వందన్ అధినియమ్-2023' సెప్టెంబర్‌లో పార్లమెంటులో ఏకగ్రీవంగా ఆమోదం పొందిన విషయాన్ని గుర్తు చేస్తూ, అప్పట్లోనే ఈ చట్టాన్ని తక్షణం అమలు చేయాలని కాంగ్రెస్ కోరిందని ఖర్గే పేర్కొన్నారు. అయితే, నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్)కు సంబంధించిన కీలక వివరాలను వెల్లడించకుండా, ప్రతిపక్షాల సహకారాన్ని కోరడం సరికాదని ఆయన లేఖలో అభిప్రాయపడ్డారు. డీలిమిటేషన్‌పై స్పష్టత లేకుండా ఈ చారిత్రక చట్టంపై అర్థవంతమైన చర్చ సాధ్యం కాదని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం అన్ని రాజకీయ పార్టీలతో సంప్రదింపులు జరిపిందని ప్రధాని చేసిన ప్రకటన వాస్తవం కాదని ఖర్గే కొట్టిపారేశారు. ఈ నెలాఖరుతో ఎన్నికల ప్రక్రియ ముగుస్తుందని, కావున ఏప్రిల్ 29 తర్వాత ఎప్పుడైనా రాజ్యాంగ సవరణలపై చర్చించేందుకు అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.


### అందరినీ ఏకతాటిపైకి తీసుకురావాలి:

పార్లమెంటు ప్రత్యేక సమావేశం ద్వారా ప్రజాస్వామ్యాన్ని పటిష్టం చేయాలన్న ఉద్దేశ్యం కేంద్రానికి ఉంటే, వెంటనే విపక్షాలతో చర్చలు జరపాలని ఖర్గే సూచించారు. నారీ శక్తి వందన్ అధినియమ్ సవరణలతో ముడిపడిన డీలిమిటేషన్ అంశంపై అఖిలపక్ష భేటీ ఏర్పాటు చేసి, అన్ని పార్టీల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని ప్రధానికి రాసిన లేఖలో ఆయన కోరారు.



# ప్రజలను ఎక్కువగా భయపెడుతోన్న వ్యాధులు ఇవే..





2025 సంవత్సరం మరికొన్ని రోజుల్లో మనకు వీడ్కోలు చెప్పబోతోంది. కానీ ఆరోగ్య విషయానికి వస్తే, ఈ సంవత్సరం మనందరికీ ఎన్నో భయానక అనుభవాలను మిగిల్చింది. టెక్నాలజీ, ఏఐ వంటి అభివృద్ధులు మన జీవితాలను సులభం చేసినప్పటికీ, మన ఆరోగ్యం మాత్రం అనేక సమస్యలను ఎదుర్కొంది. పిల్లలు, యువకులు, వృద్ధులు అన్న తేడా లేకుండా చాలా మంది తీవ్రమైన ఆరోగ్య సమ-స్యలను ఎదుర్కొంటున్నారు. ఎన్నో కుటుంబాలు తమ ప్రియమైన వారిని కోల్పోయి రోడ్డున పడ్డాయి.

భారతదేశంలోనే కాకుండా విదేశాల్లో కూడా 2025లో అనేక వ్యాధులు తీవ్ర ప్రభావం చూపాయి. గుండె జబ్బులు, డయాబెటిస్, ఊబకాయం, క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులు కూడా పెద్ద సమ-స్యగా నిలిచాయి. అలాగే.. వైరల్ జ్వరాలు, శ్వాసకోశ సమస్యలు, వాతావరణ మార్పుల వల్ల వచ్చే అనారోగ్యాలు ఈ ఏడాది ఎక్కువగా కనిపించాయి.

### గుండె జబ్బులు

ఈ సంవత్సరం ఆరోగ్య పరంగా ఎక్కువగా భయపెట్టిన సమస్యలలో గుండె జబ్బులు మొదటి స్థానంలో ఉన్నాయి. ఒకప్పుడు 50 ఏళ్లు దాటిన వారికే వచ్చే వ్యాధిగా భావించిన గుండెపోటు, ఇప్పుడు చిన్న వయసు వారినీ కూడా ప్రభావితం చేస్తోంది. గత కొన్ని సంవత్సరాలుగా గుండెపోటుతో మరణాల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ఇటీవల జిమ్‌లో వ్యాయామం చేస్తూ, ఆటలు ఆడుతూ లేదా సాధారణ పనులు చేస్తూ అకస్మాత్తుగా గుండెపోటుతో కుప్పకూలిపోయిన వారి వీడియోలు సోషల్ మీడియాలో తరచుగా కనిపిస్తున్నాయి.

2025లో ముఖ్యంగా 25 నుంచి 40 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న ఆరోగ్యంగా కనిపించే యువకుల్లో గుండెపోటు కేసులు ఎక్కువగా నమోదయ్యాయి. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (%చీజ=దీ%) నివేదిక ప్రకారం, భారతదేశంలో జరిగే మొత్తం మరణాలలో దాదాపు మూడో వంతు గుండెపోటుల వల్లనే జరుగుతున్నాయి. దీని వల్ల గుండె జబ్బులు దేశంలో మరణాలకు ప్రధాన కారణంగా మారాయని స్పష్టమవుతోంది.

### గుండె జబ్బులను ఎలా నివారించాలి?

గుండె ఆరోగ్యంగా ఉండాలంటే జీవనశైలి చాలా ముఖ్యమైనది.
ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలి
రోజూ వ్యాయామం చేయాలి
బరువును నియంత్రణలో ఉంచాలి
పొగ తాగడం మానేయాలి
ఒత్తిడిని తగ్గించుకోవాలి
తగినంత నిద్రపోవాలి

### క్యాన్సర్

క్యాన్సర్ ప్రస్తుతం భారతదేశంలో ఒక తీవ్రమైన ఆరోగ్య సమస్యగా మారింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO), భారతీయ వైద్య పరిశోధనా మండలి (ICMR) గణాంకాల ప్రకారం, ప్రతి సంవత్సరం దేశంలో లక్షల సంఖ్యలో కొత్త క్యాన్సర్ కేసులు గుర్తించబడు తున్నాయి. 2026 నాటికి ఈ సంఖ్య ఇంకా పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. 2025 నాటికి భారతదేశంలో సుమారు 2.5 మిలియన్లకు పైగా ప్రజలు క్యాన్సర్‌తో బాధపడుతున్నారు.

ప్రతి సంవత్సరం 7 లక్షలకుపైగా కొత్త కేసులు నమోదు అవుతున్నాయి. పొగాకు వినియోగం, ధూమపానం, మద్యం సేవించడం, అనారోగ్యకరమైన జీవనశైలి ఇవన్నీ క్యాన్సర్‌కు ప్రధాన కారణాలు. మహిళల్లో ఎక్కువగా రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ కనిపిస్తాయి. పురుషుల్లో నోటి క్యాన్సర్, ఊపిరితిత్తుల క్యాన్సర్ ప్రమాదం ఎక్కువ. రోజుకు సగటున సుమారు 2,500 మంది క్యాన్సర్ వల్ల మ-రణిస్తున్నారు. అందువల్ల క్యాన్సర్ భారతదేశంలో ఒక పెద్ద ప్రజారోగ్య సమస్యగా ఉంది.

### క్యాన్సర్ ఎలా నివారించాలి?

జీవనశైలి మార్పులు చాలా ముఖ్యమైనవి
పొగాకు, ధూమపానాన్ని పూర్తిగా మానేయండి.
మద్యపానాన్ని నియంత్రించండి
ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోండి
క్రమం తప్పకుండా వ్యాయామం చేయండి.

### శ్వాసకోశ వ్యాధి

భారతదేశంలో COPD (Chronic Obstructive Pulmonary Disease) చాలా వేగంగా పెరుగుతోంది. ఇది ఆస్తమా, క్షయ, న్యుమోనియా వంటి ఇతర శ్వాసకోశ వ్యాధులకంటే పెద్ద ఆరోగ్య సమస్యగా మారింది. COPD తరచుగా అల్ప లక్షణాలతో ప్రారంభమవుతుంది. దీన్ని పూర్తిగా కోలుకోవడం సాధ్యం కాదు. కేవలం లక్షణాలను నియంత్రించవచ్చు.

ప్రస్తుతం భారతదేశంలో 50-55 మిలియన్ల మంది COPDతో బాధపడుతున్నారు. ప్రతి సంవత్సరం సుమారు 1.5 మిలియన్ల మంది దీని వల్ల మరణిస్తున్నారు. ఇది కేవలం గణాంకాలు మాత్రమే కాదు, నెమ్మదిగా పెరుగుతున్న జాతీయ ఆరోగ్య సమస్య. COPD% మరణాల రేటు ఉబ్బసం, క్షయ, న్యుమోనియాకు కంటే వేగంగా పెరుగుతోంది.

### ఫ్యాటీ లివర్, డయాబెటిస్

భారతదేశంలో ఫ్యాటీ లివర్ వ్యాధి (Fatty Liver Disease), టైప్ 2 డయాబెటిస్ (Type 2 Diabetes)తో బాధపడే వ్యక్తుల సంఖ్య వేగంగా పెరుగుతోంది. ఈ రెండు వ్యాధులు ఒకదానికి సంబంధించి ఉంటాయి అని నిపుణులు గుర్తించారు. డయాబెటిస్ ఉన్నప్పుడు ఫ్యాటీ లివర్ మరింత తీవ్రమవుతుంది. ఫ్యాటీ లివర్ ఉన్నప్పుడు డయాబెటిస్ వచ్చే ప్రమాదం ఎక్కువ. ఈ రెండు వ్యాధులు ఊబకాయం (Obe-sity), ఇన్సులిన్ నిరోధకత (Insulin Resistance) వల్ల ఏర్పడతాయి.

### నివారణ

ఫ్యాటీ లివర్, డయాబెటిస్‌ని నియంత్రించడానికి జీవనశైలి మార్పులు చాలా ముఖ్యం
ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం
వర్క్-అవుట్ / వ్యాయామం
బరువు సరిగా ఉంచుకోవడం
తగినంత నిద్ర
రెగ్యులర్‌గా రక్త చక్కెర, కాలేయ ఫంక్షన్ పరీక్షలు చేయించుకోవడం

ఈ వ్యాధులు పట్టించుకోకపోతే కాలేయ క్యాన్సర్, ఇతర తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారితీస్తాయి. కాబట్టి ముందే జాగ్రత్తలు తీసుకోవడం అత్యంత అవసరం.

### ఊబకాయం

భారతదేశంలో ఊబకాయం ఒక అంటువ్యాధిగా మారింది. శరీరంలో అధిక కొవ్వు పేరుకుపోవడం వల్ల ఇది సంభవిస్తుంది. నేడు చిన్నపిల్లలు, పెద్దలు ఇద్దరూ అధిక %దీవీ×%, అధిక శరీర కొవ్వు వంటి శారీరక సమస్యలతో పోరాడుతున్నారు. ఆరుబయట ఆడుకునే సమయం తక్కువగా ఉండటం, అధిక కొవ్వు ఉన్న జంక్ ఫుడ్ తినడం, రోజులో ఎక్కువ సమయం %ూాజ% గదులలో సౌకర్యవంతంగా గడపడం వల్ల, 30 శాతం కంటే ఎక్కువ మంది భారతీయ పిల్లలు ఊబకాయంతో బాధపడుతున్నారు.

### మానసిక ఆరోగ్య సంక్షోభం

WHO ప్రకారం, మానసిక ఆరోగ్య సంక్షోభం అనేది ఒక తీవ్రమైన పరిస్థితి, దీనిలో ఒత్తిడి తట్టుకునే సామర్థ్యాలను అధిగమిస్తుంది. ఇది తీవ్రమైన భావోద్వేగాలు, గందరగోళం లేదా ఆత్మహత్య ఆలోచనలు, తీవ్రమైన ఆందోళన లేదా సైకోసిస్ వంటి తనకు లేదా ఇతరులకు హాని కలిగించే ప్రవర్తనలకు దారితీస్తుంది. 2025లో ముఖ్యంగా య-ువత నిరంతర ఒత్తిడి, డిజిటల్ అలసట, ఆర్థిక ఒత్తిడి, సామాజిక ఒంటరితనం వంటి సమస్యలతో పోరాడుతున్నారు. ఇది మానసిక, శారీరక ఆరోగ్యాన్ని ప్రతికూలంగా ప్రభావితం చేస్తుంది. పెరుగుతున్న అంటు వ్యాధుల వ్యాప్తి కూడా ప్రజలను చాలా ఇబ్బంది పెట్టింది. పెరుగుతున్న అంటు వ్యాధుల వ్యాప్తి ప్రపంచ ఆరోగ్యానికి తీవ్రమైన సవాలుగా మిగిలిపోయింది.

# ఈ పండ్లను తింటే మీకు అసలు క్యాన్సర్ రాదు..



ప్రస్తుతం భారతీయులు ఎదుర్కొంటున్న ఆరోగ్య సవాళ్లల్లో క్యాన్సర్ కూడా ఒకటి. రోజురోజుకీ ఈ వ్యాధి బారిన పడే వారి సంఖ్య పెరుగుతుందనే చెప్పవచ్చు. జీవన విధానంలో మార్పులు, ధూమపానం, జంక్ ఫుడ్ ను ఎక్కువగా తీసుకోవడం, రేడియేషన్ కు ఎక్కువగా గురవ్వడం, రసాయనాలు కలిగిన ఆహారాన్ని తీసుకోవడం, జన్యుపరమైన కారణాల వల్ల చాలా మంది ఈ వ్యాధి బారిన పడుతున్నారు. అలాగే ఈ వ్యాధికి సరైన మందు లేదనే విషయం మనందరికీ తెలిసిందే. కనుక వ్యాధి బారిన పడి బాధపడడానికి బదులుగా ముందుగానే తగిన జాగ్రత్తలు తీసుకోవడం చాలా అవసరం. ముఖ్యంగా మన ఆహారంలో మార్పులు చేసుకోవడం మరింత అవసరమని వైద్య నిపుణులు చెబుతున్నారు.

### మామిడి, నేరేడు..

క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గించడంలో కొన్ని రకాల పండ్లు మనకు ఎంతగానో దోహదపడతాయని వారు చెబుతున్నారు. వీటిని తీసుకోవడం వల్ల క్యాన్సర్ కణాల పెరుగుదల తగ్గడంతో పాటు క్యాన్సర్ బారిన పడే అవకాశాలు కూడా తక్కువగా ఉంటాయని వారు తెలియజేస్తున్నారు. క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గించే పండ్ల గురించి వివరాలను అందిస్తున్నారు. మామిడి పండ్లల్లో యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. వీటిని తీసుకోవడం వల్ల అసాధారణ కణాల పెరుగుదల వేగం తగ్గుతుంది. అలాగే నేరేడు పండ్లు కూడా క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గించడంలో మనకు సహాయపడతాయి. వీటిలో యాంటీ ప్రొలిఫెరేటివ్ లక్షణాలు ఎక్కువగా ఉంటాయి. ఇవి హానికారక కణాల వ్యాప్తిని తగ్గించడంలో దోహదపడతాయి.

### ఉసిరి, మారేడు..

ఉసిరికాయలను తీసుకోవడం వల్ల కూడా మనం క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గించుకోవచ్చు. ఉసిరిలో ప్రీక్లినికల్ నమూనాలు ఉంటాయని వీటి సారం క్యాన్సర్ పై ఆశాజనక ప్రభావాలను చూపించదని నిపుణులు చెబుతున్నారు. అలాగే కోకుమ్ అనే పండ్లను తీసుకోవడం వల్ల కూడా మంచి ఫలితం ఉంటుంది. ఈ పండ్లల్లో ఫైటోకెమికల్స్ ఎక్కువగా ఉంటాయి. వీటిని తీసుకోవడం వల్ల శరీరంలో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. అదేవిధంగా మారేడు పండ్లు కూడా క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గించడంలో ఎంతో దోహదపడతాయని చెబుతున్నారు. ఇవి క్యాన్సర్ నిరోధక సామర్థ్యాన్ని కలిగి ఉంటాయని వీటిలో ఉండే బయోయాక్టివ్ సమ్మేళనాలు కణాలను రక్షించడంలో సహాయపడతాయని తెలియజేస్తున్నారు.

### పనస, వాక్కాయలు..

అలాగే ఆహారంలో భాగంగా పనస పండ్లను తీసుకోవడం వల్ల కూడా మంచి ఫలితం ఉంటుంది. ఇవి కణాల ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించి క్యాన్సర్ ను నిరోధించడంలో ఎంతో దోహదపడతాయి. క్యాన్సర్ ను ఎదుర్కోవడంలో వాక్కాయ పండ్లు కూడా మనకు ఎంతో ఉపయోగపడతాయి. వీటిలో ఉండే రక్షణ సమ్మేళనాలు క్యాన్సర్ మార్పులను నివారించడంలో తోడ్పడతాయి. ఇక మంకీ జాక్ ఫ్రూట్ పండ్లు కూడా క్యాన్సర్ అభివృద్ధిని తగ్గిస్తాయి. ఈ పండ్లు మనలో చాలా మందికి తెలియవు. వీటిలో ఉండే ఫైటోకెమికల్స్ క్యాన్సర్ వ్యాప్తిని తగ్గించడంలో దోహదపడతాయి. ఈ విధంగా ఈ పండ్లను ఆహారంలో భాగంగా తీసుకోవడం వల్ల క్యాన్సర్ వ్యాప్తి తగ్గడంతో పాటు క్యాన్సర్ బారిన పడే అవకాశాలు కూడా తగ్గుతాయి.



# శీతాకాలంలో కీళ్ల నొప్పి.. ఎందుకు వస్తుందో తెలుసా?

శీతాకాలంలో కీళ్ల నొప్పులు, వాపు లేదా నడవడానికి ఇబ్బందిగా అనిపిస్తే జాగ్రత్త వహించడం చాలా ముఖ్యం. ఎందుకంటే, ఇది యూరిక్ యాసిడ్ స్థాయిలు పెరిగే లక్షణం కావచ్చు. ఇప్పటికే ఈ పరిస్థితి ఉన్నవారు శీతాకాలంలో ఎక్కువ సమస్యలను ఎదుర్కొంటారు. వేసవిలో కంటే శీతాకాలంలో ప్రజలు తక్కువ నీరు తాగుతారు. ఈ సీజన్‌లో ఆహారపు విధానాలు కూడా మారుతాయి, ఇది యూరిక్ యాసిడ్ స్థాయిలు పెరగడానికి ప్రధాన కారణంగా పరిగణిస్తారు.

శీతాకాలంలో ప్రజలు మాంసం, గుడ్లు ఎక్కువగా తింటారు. వీటిలో ప్యూరిన్లు ఉంటాయి. ఇవి యూరిక్ యాసిడ్ స్థాయిలను పెంచుతాయి . ఈ సీజన్‌లో శారీరక శ్రమ వేసవిలో కంటే తక్కువగా ఉంటుంది. ఇది జీవక్రియను నెమ్మదిస్తుంది. యూరిక్ యాసిడ్ పేరుకుపోవడానికి కారణమవుతుంది. కొన్ని సందర్భాల్లో, కీళ్లలో యూరిక్ యాసిడ్ స్ఫటికాలు పేరుకుపోతాయి. దీనివల్ల కీళ్ల నొప్పులు, నడవడానికి ఇబ్బంది కలుగుతుంది. ఇప్పటికే ఈ పరిస్థితులు ఉన్నవారికి, సమస్య మరింత తీవ్రమవుతుంది.

### యూరిక్ యాసిడ్ పెరుగుదల లక్షణాలు ఏమిటి?

- కాలి బొటనవేలులో అకస్మాత్తుగా తీవ్రమైన నొప్పి
- మోకాళ్లలో అకస్మాత్తుగా తీవ్రమైన నొప్పి
- వాపు కీళ్ళు
- ఉదయం నిద్ర లేచినప్పుడు నడవడానికి ఇబ్బంది పడటం
- గౌట్ వచ్చే ప్రమాదం
- యూరిక్ యాసిడ్ స్థాయిలు ఎక్కువ కాలం పాటు ఉంటే, అది గౌట్‌కు దారితీస్తుందని నిపుణులు వివరిస్తున్నారు. ఈ పరిస్థితి తీవ్రమైన కీళ్ల నొప్పికి కారణమవుతుంది. చికిత్సకు సరైన ఆహారం, మందులు తీసుకోవడం అవసరం.

### యూరిక్ యాసిడ్‌ను ఎలా నియంత్రించాలి?

- శీతాకాలంలో కూడా శరీరం డీహైడ్రేషన్‌కు గురికాకుండా చూసుకోండి.
- ఎర్ర మాంసం, కిడ్నీ బీన్స్ కు దూరంగా ఉండండి
- అధిక ప్యూరిన్ ఆహారాలను పరిమితం చేయండి
- మద్యానికి దూరంగా ఉండండి

# ఇంటింటా.. మనసులో మాట

## తొలి ముద్రణతోనే శాశ్వత ముద్ర..

### అద్భుతం.. అపూర్వం ఇది ప్రతి తెలుగు వాడి మనసులో మాట!



ఒక మహోజ్వల ఘట్టానికి
శ్రీకారం జరిగింది..

పత్రికా రంగంలో
ఒక సరికొత్త విప్లవం
ఆవిష్కారం అయింది..

కంచర్ల అచ్యుతరావు
కఠోర శ్రమ..
మొక్కవోని దీక్ష..
సడలిపోని పట్టుదల..
నిజమై.. ఋజువై..
మనసులో మాట
దినపత్రిక అచ్చంగా
అచ్చులో ముస్తాబై
ఈ ఆదివారం ఉదయం
తెలుగు రాష్ట్రాల్లో
వేల ఇళ్ల తలుపులు తట్టింది..
చదివిన కోట్ల హృదయ
తంత్రులను మీటింది..

గత కొద్ది నెలలుగా..
తెలుగు రాష్ట్రాల్లో
ప్రతి ఊళ్ళో..ప్రతి గ్రామంలో
ఒకటే వార్త..

పత్రికా ప్రపంచంలోకి
మరో కొత్త దినపత్రిక రానుందని..

రావడం అంటే అలా ఇలా
కాదు..
వస్తూనే సంచలనాలను
మోసుకు రాబోతోందని..
సంచలన వార్తలతో..
గొప్ప గొప్ప కథనాలతో..
ఆసక్తి కలిగించే ఎన్నో
వ్యాసాలతో..
అలరించే ఎన్నెన్నో సినిమా
కబుర్లతో..
నీకు..నాకు..ప్రతి
తెలుగువాడికి అవసరమైన..
ఆసక్తి అనిపించే
ఎన్నెన్నో అంశాలను
మోసుకుని ప్రతి ఇంటి
వాకిటికి చేరుకోబోతుందని..

ఆరోజు రానే వచ్చింది..
పురిటి నొప్పులను..
బాలారిష్టాలను..
ఇంకెన్నో ప్రతిబంధకాలను
అధిగమించి..
మనసులో మాట
దినపత్రిక నిన్నటి రోజున
సర్వాంగసుందరంగా
ముస్తాబై ఆదివారం నాడు..
వినీలాకాశంలో ఉదయభాస్కరుడు తన
కిరణాలతో ప్రత్యక్షమయ్యే శు
భముహూర్తానికి
నిక్కచ్చి..నిఖార్సయిన
వార్తా తరంగాలను మోసుకుని
ఉద్భవించింది..

లక్షలాది తెలుగు పాఠకుల
చేతుల్లోకి అబ్బురంగా
చేరింది..అందంగా అమరింది..

ఇంతటి మహా క్రతువుకు
ప్రధాన కారకుడు..మూల
విరాట్టు అయిన కంచర్ల
అచ్యుతరావు కుటుంబం
తమ చిరకాల స్వప్నం
మనసులో మాట పత్రిక
రూపంలో ఆవిష్కారం అయిన
వేళ ఆనందంతో
మురిసిపోయింది..
కంచర్ల కుటుంబం అంటే..
ఆయన,భార్య..సంతానం
మాత్రమే కాదు..
కంచర్ల గ్రూపు సంస్థలతో
ప్రత్యక్షంగా..పరోక్షంగా
ప్రమేయం కలిగి ఉన్న
వందలు..వేల కుటుంబాలు..
తొలి సంచిక విడుదల వేడుకను
ఈ మహా కుటుంబం మొత్తం
గొప్ప వేడుకగా జరుపుకుంది..

కంచర్ల అచ్యుతరావు స్వయంగా పత్రిక
విడుదలను
పర్యవేక్షించగా ఆయన
కుమారుడు..వర్ధమాన సినీ హీరో
కంచర్ల ఉపేంద్ర తన బిజీ షెడ్యూల్‌ను
పక్కనబెట్టి
పత్రిక ప్రచురణలో ప్రత్యక్షంగా పాలు
పంచుకుని తండ్రి
ఆశయం కార్యరూపం
దాలుస్తున్న ఉద్విగ్న ఘట్టాన్ని
తన చేతులతో స్వయంగా
ఆవిష్కరించారు.

మొత్తంగా..తెలుగు పత్రికా
రంగంలో ఒక సువర్ణ ఘట్టం
ఆవిష్కారం అయింది..
ఒక సరికొత్త అధ్యాయానికి
నాంది జరిగింది..

చాలా మంది జర్నలిస్టులు
చాలాకాలంగా మర్చిపోయిన
వేతనం అనే మాట కంచర్ల గ్రూపు
మీడియా రంగ ప్రవేశంతో మళ్ళీ పది
మంది నోటా వినిపించడం
మొదలైంది..వందలాది మంది
జర్నలిస్టులకు వేతనాలతో కూడిన
కొలువులు దొరికాయి.
వార్తకు తగ్గ విత్తు..
కష్టానికి తగిన ప్రతిఫలం..

ఇంత రాస్తే ఇంత..
ఎంత రాసినా ఇంతే..
అనే కొలతలు.. కొలమానాల
విధానానికి స్వస్తి చెబుతూ
పనికి తగిన ప్రతిఫలం..
నైపుణ్యాన్ని గౌరవించే
వేతనం..

జీతంతో పాటు మర్యాద..
సేకరించే ప్రకటనలకు తగిన
కమిషన్..
ఇన్సూరెన్స్ ..ఇంకా ఇంకా
ఎన్నో సౌకర్యాలు..
అన్నీ కల్పిస్తూ
సంస్థలో ప్రతి ఉద్యోగిని
కుటుంబసభ్యుడిగా
ఆదరించి..అభిమానించే
గొప్ప సంప్రదాయానికి
అంకురార్పణ చేసిన కంచర్ల
అచ్యుతరావు సారధ్యంలో
మనసులో మాట పత్రిక
దినదిన ప్రవర్ధమానమై..
వేలతో మొదలై..లక్షలు..కోట్ల
సర్క్యులేషన్ సాధించి
ఒక విప్లవానికి మారుపేరుగా
నిలవాలి..

పత్రిక బాగుంటే..
యాజమాన్యం మాత్రమే కాదు..
జర్నలిస్టులూ బాగుంటారు..

మంచి వార్తలు వస్తాయి..
ఇప్పుడిప్పుడే పత్రిక చదివే
అలవాటుకు దూరమైన
జనం..ప్రధానంగా యువత
మళ్ళీ పత్రికా పఠనం వైపు
మళ్లేలా చెయ్యడంలో
మనసులో మాట పత్రిక
ప్రధాన దిక్సూచిగా ఉంటుంది..
ఇది నిక్కచ్చి..
ఇది నిస్సందేహం..

మనసులో మాట
ఒక ఒరవడి..
ఒక వడి..
ఒక వాడి..
ఒక వేడి..
ఒక గాడి..
ఒక సవ్వడి..
ఒక సందడి..
ఒక అలజడి..
మొత్తంగా జనం నాడి..



అభినందనలతో..
ఎలిశెట్టి సురేష్ కుమార్











# క్రీడల్లో పట్టుదల ఉంటే పతకాల పంటే..

**జాతీయ టార్గెట్ బాల్ ఛాంపియన్‌గా ఆంధ్రప్రదేశ్!**

**ఉత్తరప్రదేశ్‌పై ఘనవిజయం..**

**ఫెడరేషన్ కప్‌లో రన్నరప్‌గా నిలిచిన ఏపీ జట్టు**

(మనసులో మాట క్రీడా ప్రతినిధి)

క్రీడాకారులలో ఉన్న సృజనాత్మకతను వెలికితీసి.. వారి క్రమశిక్షణతో పాటు శిక్షణ ఇచ్చి తగిన మెళుకువలు నేర్పిన క్రీడా ప్రోత్సాహకులు, కోచ్‌లు, ఎంతటి విజయమైనా సాధించగలరని జాతీయ బాలబాలికల టార్గెట్ బాల్ లో క్రీడాకారులు చూపిన ప్రతిభ రుజువు చేసిందని ఆంధ్ర ప్రదేశ్ టార్గెట్‌బాల్ క్రీడాకారులను ఆంధ్ర ప్రదేశ్ టార్గెట్ బాల్ అధ్యక్షులు కంచర్ల అచ్యుతరావు తెలిపారు. ఈనెల 4 వ తేదీ నుంచి 7 తేదీ వరకు మనోజ్ సర్కార్ స్పోర్ట్స్ స్టేడియం, రుద్రపూర్, ఉత్తరాఖండ్ రాష్ట్రంలో జరిగిన 13వ సీనియర్ నేషనల్ బాల బాలికల టార్గెట్ బాల్ ఛాంపియన్షిప్ , 5వ సీనియర్ బాలుర టార్గెట్ బాల్ ఫెడరేషన్ కప్ పోటీలలో ఆంధ్ర ప్రదేశ్ జట్టు సీనియర్ జాతీయ స్థాయిలో ఉత్తరప్రదేశ్ జట్టు పై 23-10 స్కోర్ తో విజయం సాధించి ఛాంపియన్‌గా నిలిచింది .అలాగే ఫెడరేషన్ కప్ ఫైనల్‌లో ఉత్తరప్రదేశ్ జట్టు పై వర్షం కారణంగా మ్యాచ్ నిలిచిపోవడం తో 10-9 స్కోర్ తో రన్నర్ అప్ గా నిలిచింది. కోచ్ వాసుపల్లి గురుమూర్తి పూసపాటి సత్యనారాయణ రాజు, కెప్టెన్ జి సందీప్ (దీపు)ల కృషితో ఆంధ్ర ప్రదేశ్ జట్టు తమ సత్తా చాటింది. ఈ పోటీలలో క్రీడాకారుడు భాస్కర్ అద్భుత ప్రదర్శనకు ఉత్తమ ప్లేయర్ అవార్డు, జి.సందీప్ (దీపు), ఉత్తమ డైమండ్ (గోల్ కీపర్) ప్రత్యేక బహుమతులు అందుకున్నారు. ఆంధ్ర ప్రదేశ్ టార్గెట్బాల్ క్రీడాకారులను ఆంధ్ర ప్రదేశ్ టార్గెట్ బాల్ అధ్యక్షులు కంచర్ల అచ్యుతరావు, కార్యదర్శి ఎం.సురేష్ కుమార్ క్రీడాకారులను ప్రోత్సహిస్తూ వారికి శుభాకాంక్షలు తెలిపారు.

# భారత్‌కు స్వర్ణం

**ప్యూబ్లా(మెక్సికో):** ఆర్చరీ వరల్డ్‌కప్ స్టేజ్-1లో భారత్ పసిడి పతకంతో మెరిసింది. శనివారం జరిగిన మహిళల కాంపౌండ్ టీమ్ ఈవెంట్‌లో భారత త్రయం వెన్నం జ్యోతిసురేఖ, మధుర, ప్రగతి 233-232తో అమెరికాపై ఉత్కంఠ విజయాన్ని సాధించింది. తొలి రౌండ్ నుంచే భారత్, అమెరికా ఢీ అంటే ఢీ అన్నట్లు పోటీపడ్డాయి. తొలి రౌండ్‌లో భారత్ 59-58తో అమెరికాపై స్వల్ప ఆధిక్యం ప్రదర్శించగా, రెండో రౌండ్‌లో ఆధిక్యం 114-117 తగ్గింది. అయితే మూడో రౌండ్ ముగిసే సరికి 173-174తో స్వల్ప వెనుకంజలో ఉన్న భారత్ చివర్లో ఆరు పది పాయింట్లు ఖాతాలో వేసుకోవడంతో పసిడి ఖాతాలో చేరింది.




# వాంఖడేలో పరుగుల వరద.. ఆర్సీబీదే విజయం!

**ముంబై ఇండియన్స్‌పై 18 పరుగుల తేడాతో గెలుపు**

**చెలరేగిన బ్యాటర్లు.. ఫిల్ సాల్ట్ (78), పాటిదార్ (53), కోహ్లీ (50) హాఫ్ సెంచరీలు**





**ముంబై, ఏప్రిల్ 12:** ఐపీఎల్‌లో భాగంగా ముంబైలోని వాంఖడే స్టేడియం వేదికగా ఆదివారం పరుగుల వరద పారింది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ), ముంబై ఇండియన్స్ (ఎంఐ) జట్ల మధ్య జరిగిన ఈ ఆసక్తికర పోరులో విజయం ఆర్సీబీనే వరించింది. బ్యాటర్లు ఆకాశమే హద్దుగా చెలరేగిన ఈ మ్యాచ్‌లో ముంబైపై 18 పరుగుల తేడాతో ఆర్సీబీ ఘన విజయం సాధించింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఆర్సీబీ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి ఏకంగా 240 పరుగుల భారీ స్కోరు సాధించింది. అనంతరం లక్ష్య ఛేదనలో ముంబై ఇండియన్స్ సైతం దీటుగా బదులిచ్చినప్పటికీ, 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 222 పరుగులకే పరిమితమై ఓటమిపాలైంది.

## ఆర్సీబీ బ్యాటింగ్ విధ్వంసం

టాస్ గెలిచిన ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా ముందుగా బౌలింగ్ ఎంచుకున్నాడు. బ్యాటింగ్‌కు దిగిన ఆర్సీబీ బ్యాటర్లు ఆది నుంచే ముంబై బౌలర్లపై విరుచుకుపడ్డారు. ముఖ్యంగా ఓపెనర్ ఫిల్ సాల్ట్ మైదానం నలుమూలలా బౌండరీల వర్షం కురిపించాడు. కేవలం 36 బంతుల్లోనే 78 పరుగులు చేసి స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. మరోవైపు స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ 38 బంతుల్లో 50 పరుగులు చేసి ఇన్నింగ్స్‌కు మూలస్తంభంలా నిలిచాడు. వీరిద్దరూ అద్భుతమైన పునాది వేయడంతో, ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన రజత్ పాటిదార్ సైతం ఏమాత్రం తగ్గలేదు. బౌలర్ ఎవరన్నది చూడకుండా సిక్సర్లు, ఫోర్లతో విరుచుకుపడి కేవలం 20 బంతుల్లోనే 53 పరుగులు చేసి విధ్వంసం సృష్టించాడు. దీంతో ఆర్సీబీ 240 పరుగుల భారీ స్కోరును నమోదు చేయగలిగింది. ముంబై బౌలర్లలో శార్దూల్ ఠాకూర్ (1/32), హార్దిక్ పాండ్యా (1/39), మిచెల్ సాంట్నర్ (1/43) తలో వికెట్ తీసినప్పటికీ భారీగా పరుగులు సమర్పించుకున్నారు.

## పోరాడి ఓడిన ముంబై

241 పరుగుల కఠిన లక్ష్యంతో బరిలోకి దిగిన ముంబై ఇండియన్స్ ఏ దశలోనూ వెనక్కి తగ్గలేదు. భారీ లక్ష్య ఛేదనలో కావాల్సిన రన్ రేట్‌ను అందుకునేందుకు తీవ్రంగా శ్రమించింది. మిడిలార్డర్‌లో షెర్ఫాన్ రూథర్‌ఫోర్డ్ అద్భుతమైన ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. కేవలం 31 బంతుల్లోనే అజేయంగా 71 పరుగులు చేసి ముంబై శిబిరంలో ఆశలు రేకెత్తించాడు. అతనికి తోడుగా కెప్టెన్ హార్దిక్ పాండ్యా 22 బంతుల్లో 40 పరుగులు, ర్యాన్ రికెల్టన్ 22 బంతుల్లో 37 పరుగులతో మెరుగైన ప్రదర్శన చేశారు. ఒక దశలో ముంబై బ్యాటర్ల దాటికి మ్యాచ్ ఉత్కంఠభరితంగా మారినప్పటికీ.. ఆర్సీబీ బౌలర్లు కీలక సమయాల్లో కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి ముంబై బ్యాటర్లను నిలువరించారు. ముఖ్యంగా సుయాశ్ శర్మ 4 ఓవర్లలో 47 పరుగులిచ్చి 2 కీలక వికెట్లు తీశాడు. రసిఖ్ సలామ్ (1/23), కృనాల్ పాండ్యా (1/26) తలో వికెట్ పడగొట్టి ముంబైని కట్టడి చేయడంలో సఫలమయ్యారు. చివరికి ముంబై 222 పరుగుల వద్దే ఆగిపోవడంతో ఆర్సీబీ ఖాతాలో అద్భుత విజయం చేరింది.








# టైటాన్స్ పంజా.. లక్నో చిత్తు!

**ఎకానా స్టేడియంలో లక్నోపై 7 వికెట్ల తేడాతో గుజరాత్ ఘన విజయం**

**లక్నో, ఏప్రిల్ 12:** ఐపీఎల్ టోర్నీలో గుజరాత్ టైటాన్స్ అద్భుత విజయాన్ని నమోదు చేసింది. అర్ధోనమౌలోని ఎకానా క్రికెట్ స్టేడియం బీ గ్రౌండ్ వేదికగా ఆదివారం జరిగిన ఆసక్తికర పోరులో లక్నో సూపర్ జెయింట్స్‌పై 7 వికెట్ల తేడాతో గుజరాత్ సత్తా చాటింది. బౌలింగ్‌లో ప్రసిద్ధ్ కృష్ణ నాలుగు వికెట్లతో లక్నోను కట్టడి చేయగా.. బ్యాటింగ్‌లో జోస్ బట్లర్, శుభ్‌మన్ గిల్ అర్ధ సెంచరీలతో చెలరేగి జట్టుకు సునాయాస విజయాన్ని అందించారు. తొలుత బ్యాటింగ్ చేసిన లక్నో నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 164 పరుగులు చేయగా.. అనంతరం బరిలోకి దిగిన గుజరాత్ కేవలం 18.4 ఓవర్లలో 3 వికెట్లు మాత్రమే కోల్పోయి 165 పరుగులు సాధించి విజయాన్ని ఖాయం చేసుకుంది.

## కట్టడి చేసిన గుజరాత్ బౌలర్లు

ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన గుజరాత్ టైటాన్స్ కెప్టెన్ ముందుగా బౌలింగ్ ఎంచుకున్నాడు. బ్యాటింగ్‌కు దిగిన లక్నో సూపర్ జెయింట్స్ బ్యాటర్లను గుజరాత్ బౌలర్లు కచ్చితమైన లైన్ లెంగ్త్‌తో కట్టడి చేశారు. ఏ దశలోనూ లక్నో బ్యాటర్లు స్వేచ్ఛగా పరుగులు చేయలేకపోయారు. ఎయిడెన్ మార్క్రమ్ 21 బంతుల్లో 30 పరుగులు చేసి టాప్ స్కోరర్‌గా నిలిచాడు. నికోలస్ పూరన్ 21 బంతుల్లో 19 పరుగులు, రిషభ్ పంత్ 11 బంతుల్లో 18 పరుగులతో తీవ్రంగా నిరాశపరిచారు. మిగతా బ్యాటర్లు కూడా భారీ స్కోర్లు చేయడంలో విఫలమవడంతో లక్నో 164 పరుగులకే పరిమితమైంది. గుజరాత్ బౌలర్లలో ప్రసిద్ధ్ కృష్ణ తన కోటా 4 ఓవర్లలో కేవలం 28 పరుగులిచ్చి 4 కీలక వికెట్లు పడగొట్టి లక్నో పతనాన్ని శాసించాడు. అశోక్ శర్మ 32 పరుగులిచ్చి 2 వికెట్లు, మొహమ్మద్ సిరాజ్ కేవలం 19 పరుగులు మాత్రమే ఇచ్చి ఒక వికెట్ తీసి అతనికి అద్భుతమైన సహకారం అందించారు.



## ఆడుకున్న బట్లర్, గిల్

165 పరుగుల మోస్తరు లక్ష్య ఛేదనతో బరిలోకి దిగిన గుజరాత్ టైటాన్స్‌కు ఓపెనర్లు జోస్ బట్లర్, శుభ్‌మన్ గిల్ అదిరిపోయే శుభారంభాన్ని అందించారు. లక్నో బౌలర్లను దీటుగా ఎదుర్కొంటూ ఆరంభం నుంచే దూకుడుగా ఆడారు. బట్లర్ 37 బంతుల్లోనే 60 పరుగులు చేసి పెవిలియన్ చేరగా.. గిల్ 40 బంతుల్లో 56 పరుగులు సాధించి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. వీరిద్దరూ అవుటైన తర్వాత క్రీజులోకి వచ్చిన వాషింగ్టన్ సుందర్ కేవలం 13 బంతుల్లోనే అజేయంగా 21 పరుగులు చేసి లాంఛనాన్ని పూర్తి చేశాడు. ఇంకా 8 బంతులు మిగిలి ఉండగానే గుజరాత్ లక్ష్యాన్ని చేరుకుంది.

## తేలిపోయిన లక్నో బౌలింగ్

మోస్తరు లక్ష్యాన్ని కాపాడుకోవడంలో లక్నో బౌలర్లు పూర్తిగా విఫలమయ్యారు. గుజరాత్ బ్యాటర్లను కట్టడి చేయలేక చేతులెత్తేశారు. దిగ్వేశ్ రాఠీ 4 ఓవర్లలో 31 పరుగులిచ్చి ఒక వికెట్, ప్రిన్స్ యాదవ్ 31 పరుగులిచ్చి ఒక వికెట్, మొహమ్మద్ షమీ 36 పరుగులిచ్చి ఒక వికెట్ తీసుకున్నారు. కీలక సమయాల్లో వికెట్లు తీయలేకపోవడం, బట్లర్, గిల్ జోడీని విడదీయడంలో విఫలమవడం లక్నో ఓటమికి ప్రధాన కారణమైంది. అద్భుతమైన బౌలింగ్ ప్రదర్శనతో గుజరాత్ విజయానికి బాటలు వేసిన ప్రసిద్ధ్ కృష్ణకు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది.



# యోధుడి లుక్‌లో అరవింద్ కృష్ణ..

## 'కర్మస్థలం'పై పెరుగుతున్న అంచనాలు


రాయ్ ఫిల్మ్స్ సమర్పణలో అరవింద్ కృష్ణ, చుంకీ పాండే, అర్చనా శాస్త్రి, ప్రిన్స్, దివి ప్రధాన పాత్రల్లో రాకీ షెర్మాన్ తెరకెక్కిస్తున్న చిత్రం 'కర్మస్థలం'. ఈ చిత్రాన్ని రాయ్ ఫిల్మ్స్ నిర్మిస్తుండగా, సంగీతాన్ని సాయి కార్తిక్ అందిస్తున్నారు. తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ఈ సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే విడుదల చేసిన పోస్టర్లు ప్రేక్షకులను ఆకర్షించగా, తాజాగా అరవింద్ కృష్ణ పాత్రకు సంబంధించిన కొత్త లుక్‌ను విడుదల చేశారు. ప్రస్తుతం సూపర్ హీరో తరహా పాత్రలతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్న అరవింద్ కృష్ణ, ఈ చిత్రంలో యోధుడి రూపంలో కనిపించబోతున్నారు. విడుదలైన లుక్‌లో ఆయన పాత్ర శక్తివంతంగా కనిపిస్తుండగా, విజువల్స్, బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ ఈ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని చిత్రబృందం భావిస్తోంది. ఈ చిత్రంలో అరవింద్ కృష్ణతో పాటు చుంకీ పాండే, అర్చనా శాస్త్రి, ప్రిన్స్, దివి, కాలకేయ ప్రభాకర్, వెంకటేష్ ముమ్మిడి, వినోద్, బలగం సంజయ్, దిల్ రమేష్, నాగ మహేష్, వినోద్ అల్వా, మిథాలీ చౌహన్, కిల్లి క్రాంతి తదితరులు ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న ఈ చిత్రం త్వరలోనే ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు.

# వాటికే పరిమితం కాను:

## ప్రియాంక అరుళ్ మోహన్



టాలీవుడ్‌లో తక్కువ సమయంలోనే ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న నటి ప్రియాంక అరుళ్ మోహన్, విభిన్న పాత్రలే తన లక్ష్యమని తెలిపారు. 'గ్యాంగ్ లీడర్' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన ఆమె, ఇటీవల 'మేడ్ ఇన్ కోరియా' చిత్రంతో మరోసారి మంచి స్పందన పొందారు. బయో టెక్నాలజీలో డిగ్రీ పూర్తి చేసిన తర్వాత సినిమాలపై ఆసక్తితో నటిగా మారానని ప్రియాంక తెలిపారు. 'ఒంధ్ కథే హెళ్లా' అనే కన్నడ చిత్రంతో తన సినీ ప్రయాణాన్ని ప్రారంభించినట్లు చెప్పారు. నాని, శర్వానంద్ వంటి హీరోలతో కలిసి పనిచేయడం ద్వారా ఎంతో నేర్చుకున్నానని, పవన్ కళ్యాణ్‌తో 'ఓజీ' (గా+) చిత్రంలో నటించడం మ-రచిపోలేని అనుభవంగా నిలిచిందన్నారు. కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా, సవాలు చేసే విభిన్న పాత్రల్లో నటించడానికే తాను ఆసక్తి చూపుతానని ప్రియాంక అరుళ్ మోహన్ స్పష్టం చేశారు.



# బేబమ్మకు వరుస ఫ్లాపులు

## 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ'తో మరోసారి నిరాశ

'ఉప్పెన' చిత్రంతో తెలుగు తెరకు పరిచయమైన నటి కృతి శెట్టి, తొలి సినిమాతోనే మంచి గుర్తింపు సాధించింది. ఆ తరువాత 'శ్యామ్ సింగ రాయ్', 'బంగార్రాజు' చిత్రాలతో వరుస విజయాలు అందుకుని బిజీ హీరోయిన్‌గా మారింది. అయితే అనంతరం ఆమె నటించిన పలు చిత్రాలు ఆశించిన ఫలితాలు ఇవ్వకపోవడంతో కెరీర్‌లో వరుస నిరాశలు ఎదురవుతున్నాయి. తాజాగా విడుదలైన 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' చిత్రం కూడా ప్రేక్షకులను పెద్దగా ఆకట్టుకోలేకపోతున్నట్లు సినీ వర్గాల్లో చర్చ సాగుతోంది. తమిళంలో వీకెండ్ రోజుల్లో కొంత వసూళ్లు వచ్చినప్పటికీ, తెలుగులో స్పందన పరిమితంగానే ఉన్నట్లు తెలుస్తోంది. 2040 నేపథ్యంలో తెరకెక్కిన ఈ ప్రేమకథలో కథ, కథనం ఆశించిన స్థాయిలో లేకపోవడం నెగటివ్ స్పందనకు కారణమవుతోందని భావిస్తున్నారు. ఈ చిత్రంలో కృతి శెట్టికి నటనకు కొంత అవకాశమున్నప్పటికీ, తన ప్రతిభను పూర్తిస్థాయిలో చూపించే స్థలం దక్కలేదనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఇదే ఏడాది విడుదలైన కార్తీతో చేసిన చిత్రం కూడా ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయింది. ప్రస్తుతం కృతి శెట్టి నటించిన 'జీనీ' చిత్రం విడుదల కోసం ఎదురుచూస్తోంది. జయం రవి హీరోగా రూపొందిన ఈ ఫాంటసీ డ్రామా వివిధ కారణాలతో ఆలస్యం అవుతోంది. ఇప్పటికే పలువురు ప్రముఖ హీరోలతో నటించినప్పటికీ, మరో భారీ విజయంతో మళ్లీ ఫామ్‌లోకి వస్తుందా అన్నది సినీ వర్గాల్లో ఆసక్తిగా మారింది.



# తెలుగింటి కోడలు కాబోతున్నదా?

## హాట్ టాపిక్ గా అల్లు అరవింద్ వ్యాఖ్యలు

స్టార్ హీరోయిన్ మృణాల్ ఠాకూర్ తెలుగింటి కోడలు కాబోతుందా అనే చర్చ సినీ వర్గాల్లో జోరుగా సాగుతోంది. ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ చేసిన సరదా వ్యాఖ్యలు ఈ అంశాన్ని హాట్ టాపిక్‌గా మార్చాయి. మృణాల్ ఠాకూర్ ప్రతిభపై స్పందించిన అల్లు అరవింద్, తక్కువ సమయంలోనే ఆమె మంచి గుర్తింపు సంపాదించుకుందని తెలిపారు. 'సీతారామం' చిత్రంతో తన నటన ప్రతిభను నిరూపించుకుని తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన గతాన్ని గుర్తుచేస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. గతంలో ఒక హీరోయిన్‌ను మనస్ఫూర్తిగా దీవించానని, అనంతరం ఆమె వరుణ్ తేజ్‌ను వివాహం చేసుకుని తమ ఇంటి కోడలిగా మారిందని తెలిపారు. అదే విధంగా మృణాల్ ఠాకూర్‌ను కూడా దీవిస్తున్నానని, తెలుగు సినిమాలు చేస్తూ ఇక్కడే ఒక మంచి వ్యక్తిని చూసుకుని పెళ్లి చేసుకుని తెలుగు రాష్ట్రాల్లో స్థిరపడాలని కోరుకుంటున్నట్లు సరదాగా వ్యాఖ్యానించారు. అల్లు అరవింద్ చేసిన ఈ వ్యాఖ్యలతో మృణాల్ ఠాకూర్ తెలుగింటి కోడలు కాబోతుందా అనే చర్చ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. సినీ వర్గాల్లో కూడా ఈ వ్యాఖ్యలు ఆసక్తికర చర్చలకు దారితీస్తున్నాయి.



CHIEF EDITOR BY **KANCHARLA ATCHUTA RAO** PUBLISHED AND OWNED BY KANCHARLA UPENDRA. D.NO. 1-86-3/LIG-230/5, SECTOR 5, MVP COLONY, VISAKHAPATNAM, ANDHRA PRADESH - 530017. RNI.Title.Code:-APTEL/25/42169. PRINTED BY **CHAITANYAVARADHI** PRINTERS D.NO. 3-39, BHARNIKAM VILLAGE & POST, PARAVADA MANDAL, VISAKHAPATNAM, ANDHRA PRADESH - 531021. E-MAIL: kancharlamediaprint@gmail.com CELL: 8374758861